

తలసరి ఆదాయంలో వృద్ధి

- ఈ ఏడాది రూ.2,73,026
- గత ఏడాదితో పోలిస్తే పది శాతం అధికం
- రానున్న ఆర్థిక సంవత్సరంలో రూ.3,18,821కి పెరుగుతుందని అంచనా
- స్థూల ఉత్పత్తి రూ.51,500 కోట్ల నుంచి రూ.56,908 కోట్లకు పెరుగుదల
- కలెక్టర్ల సదస్సులో జిల్లా ప్రగతి గణాంకాలు వెల్లడి



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన మంగళవారం అమరావతిలో నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో పాల్గొన్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి):
కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత జిల్లాలో తలసరి ఆదాయం, స్థూల ఉత్పత్తిలో చెప్పుకోదగిన వృద్ధి కనిపిస్తున్నది. రాష్ట్ర సగటుతో పోలిస్తే, కొన్ని రంగాల్లో వెనుకబడి వున్నప్పటికీ అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నది. మంగళవారం అమరావతిలో జరిగిన కలెక్టర్ల తొలిరోజు సదస్సులో అనకాపల్లి జిల్లా ప్రగతి గణాంకాలను ప్రభుత్వం వెల్లడించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తలసరి ఆదాయం రూ.2,73,026గా ప్రకటించారు. వచ్చే ఏడాది ఇది రూ.3,18,821కి వృద్ధి చెందే అవకాశాలున్నాయని ప్రభుత్వం అంచనా వేస్తున్నది. 2022-23లో జిల్లా తలసరి ఆదాయం రూ.2,17,076 కాగా 2023-24 లో 2,47,377కి పెరిగింది. కాగా స్థూల ఉత్పత్తి 2023-24లో రూ.51,500 కోట్లు ఉండగా 2024-25లో రూ.56,908 కోట్లకు పెరిగింది. రాష్ట్ర జీడీపీలో జిల్లా స్థూల ఉత్పత్తి 3.57 శాతం ఉన్నట్టు వెల్లడించారు. ప్రతి సోమవారం ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు జిల్లాలో తొమ్మిది నెలల కాలంలో 45,884 అర్జీలు అందాయి. వీటిలో 90 శాతానికిపైగా పరిష్కరించినట్టు నివేదికలో పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో రాష్ట్ర స్థాయిలో అనకాపల్లి జిల్లా 9వర్యాంకులో ఉంది. ప్రభుత్వ పనితీరుపై నిర్వహించిన సర్వేలో జిల్లాకు ఫైవ్ స్టార్ రేటింగ్స్ 19.3 శాతం మంది ఇవ్వగా, 47 శాతం మంది ఒక స్టార్ రేటింగ్ ఇచ్చారు.

నూకాంబిక అమ్మవారి ఘటాల ఊరేగింపు



నూకాంబిక అమ్మవారి ఉత్సవ విగ్రహం

అనకాపల్లి నూకాంబిక అమ్మవారి మాలధారణ సంఘం వ్యవస్థాపకులు పాలిమేర శ్రీను ఆధ్వర్యంలో ఘటాల ఊరేగింపును మంగళవారం సాయంత్రం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. 12 అడుగుల నూకాంబిక అమ్మవారి నూతన ఉత్సవమూర్తి విగ్రహాన్ని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆవిష్కరించి పూజలు చేసి ఊరేగింపును ప్రారంభించారు. కొత్తఅమావాస్య జాతరకు ముందస్తుగా ఘటాల ఊరేగింపు నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది.

- అనకాపల్లి టౌన్/ ఆంధ్రజ్యోతి



ఆలయం నుంచి ఘటాలతో బయలుదేరిన భక్తులు

బయ్యవరం భూదందాపై చర్యలకు మీనమేషాలు

కూటమి అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు దాటినా బహిర్గతం కాని నివేదికలు

- వైసీపీ హయాంలో వందలాది ఎకరాల ప్రభుత్వ భూములు కబ్జా
- రియల్ ఎస్టేట్ వెంచర్ పేరుతో కొండలు, గెడ్డలు, వాగులు ధ్వంసం
- వేలాది చెట్లు నరికివేత
- తెరవెనుక నాటి ఓ మంత్రి అనుచరులు
- మీడియాలో కథనాలతో అప్పటి విశాఖ కలెక్టర్ నేతృత్వంలో విచారణ
- నివేదికను బయటపెట్టని వైసీపీ ప్రభుత్వం
- లోకాయుక్తలో జనసేన నేతల ఫిర్యాదు
- విచారణ జరిపి నివేదిక ఇచ్చిన అధికారులు
- కబ్జాదారులపై చర్యలు శూన్యం
- కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో రూటు మార్చిన రియల్టర్
- అధికార పార్టీ నేతలతో మంతనాలు



కశింకోట మండలం విస్సన్నపేటలో జిరాయితీ, ప్రభుత్వ భూములను కలిపి వేసిన వెంచర్



పేదల డి.పట్టా భూముల్లో నుంచి వేసిన 80 అడుగుల రహదారి

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)
గత ప్రభుత్వ హయాంలో అడ్డగోలుగా సాగిన ప్రభుత్వ, డి.పట్టా భూముల ఆక్రమణలు, కబ్జాలపై సమగ్ర విచారణ చేపట్టి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాల్సిన కూటమి ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తున్నదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా వైసీపీ అధికారంలో వున్నప్పుడు కశింకోట మండలం బయ్యవరం రెవెన్యూ పరిధిలోని విస్సన్నపేటలో వందలాది ఎకరాల ప్రభుత్వ భూములను ఓ మంత్రి అండతో ఆయన అనుచరులు, రియల్టర్ కలిసి ఆక్రమించుకుని భారీ లేఅవుట్ వేసిన వైనంపై ఇంతవరకు చర్యలకు ఉపక్రమించలేదు. అప్పట్లో ఉమ్మడి విశాఖపట్నం జిల్లా కలెక్టర్ నేతృత్వంలో ... మిగతా 8వ పేజీలో

భానుడి ప్రతాపం

- రావికమతంలో 38.6 డిగ్రీలు నమోదు

అనకాపల్లి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి):
జిల్లాలో భానుడు భగభగమంటున్నాడు. సోమవారం వాతావరణం చల్లబడి పలుచోట్ల వర్షాలు కురిసినప్పటికీ బుధవారం ఎండలు మండిపోయాయి. ఎండ వేడికితోడు ఉక్కపోతతో జనం ఇబ్బంది పడ్డారు. రావికమతం మండలంలో 38.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. దేవరాపల్లిలో 38.5, మాడుగులలో 37.7, అనకాపల్లిలో 36.6, అచ్యుతాపురంలో 35, బుచ్చెయ్యపేటలో 37.1, చీడికాడలో 34.5, చోడవరంలో 34, గొలుగొండలో 36, కె.కోటపాడులో 34.7, కశింకోటలో 35.7, కోటవురట్లలో 35.4, మాకవరపాలెంలో 32.8, మునగపాకలో 36.4, నక్కపల్లిలో 34.4, నర్సీపట్నంలో 36,6, నాతవరంలో 34.8, పరవాడలో 34, పాయకరావుపేటలో 34, రాంబిల్లిలో 31.8 డిగ్రీల గరిష్ఠత ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

రైల్వే జోన్ పనులను అడ్డుకున్న గిరిజనులు

- ఆ భూములను గతంలో ప్రభుత్వం తమకు కేటాయించిందంటూ వాదన
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసుకోవాలన్న కాంట్రాక్టు కంపెనీ సిబ్బంది

-8లో

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.13 (బుధవారం సాయంత్రం)
సహర్ : 4.41 (గురువారం ఉదయం)

విద్యుత్ అంతరాయాలకు చెక్

నర్సీపట్నం ఈఈ పరిధిలో నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు

- ట్రాన్స్‌ఫార్మాల లోడ్ పెంపు
- కొత్తగా 55 ట్రాన్స్‌ఫార్మాలు ఏర్పాటు
- మూడుచోట్ల సబ్ స్టేషన్ల నిర్మాణం
- వేసవిలో డిమాండ్‌ను ఎదుర్కొనేందుకు ఇప్పటి నుంచే చర్యలు



పెదబొడ్డేపల్లి విద్యుత్ సబ్ స్టేషన్

నర్సీపట్నం, మార్చి 25(ఆంధ్రజ్యోతి):
వేసవిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ఈపీడీసీఎల్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచడంతోపాటు, కొత్త ట్రాన్స్‌ఫారాలు, విద్యుత్ సబ్ స్టేషన్‌ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.



కె.కోటపాడు మండలం చౌడువాడలో నిర్మాణంలో వున్న సబ్ స్టేషన్

ఈపీడీసీఎల్ నర్సీపట్నం ఈఈ పరిధిలోని 13 మండలాల్లో కేటగిరి-1 గృహ వినియోగ సర్వీసులు 2,23,868, కేటగిరి-2 వాణిజ్య సర్వీసులు 23,934, కేటగిరి-3 పారిశ్రామిక సర్వీసులు 913, ప్రభుత్వ కేటగిరీ సర్వీసులు 4, స్థానిక సంస్థల సర్వీసులు 6,487 ఉన్నాయి. ప్రతి నెలా విద్యుత్ కనెక్షన్లు, తద్వారా విద్యుత్ వినియోగం పెరుగుతూ వస్తున్నది. ఇళ్లు, పరిశ్రమల్లో విద్యుత్ వినియోగం పెరిగిపోయి ట్రాన్స్‌ఫారాల మీద అధిక లోడు పడుతున్నది. దీంతో పీక్ అవర్స్‌లో పరిశ్రమలకు విద్యుత్ సరఫరా ఆపాల్సి వస్తున్నది. ట్రాన్స్‌ఫార్మర్లు ట్రిప్ అవుతుండడంతో ఇళ్లకు కూడా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నది.

గత ఏడాది వేసవి ఆరంభంలో (మార్చి నెల) 36.97 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం నమోదైంది. ఏప్రిల్‌లో ఇది 40.86 మిలియన్ యూనిట్లకు పెరిగింది. మే నెలలో 36.61 మిలియన్ యూనిట్లు, జూన్‌లో 30.72 మిలియన్ యూనిట్లు చొప్పున వేసవి నాలుగు నెలల్లో 145.16 మిలియన్ యూనిట్లు విద్యుత్ వినియోగం జరిగింది. పెరుగుతున్న వినియోగంతో ఈ ఏడాది వేసవిలో 160 మిలియన్ యూనిట్లకు చేరుతుందని ... మిగతా 8వ పేజీలో

ఎనిమిది మంది పోలీసులకు ఉగాది పురస్కారాలు



బి.శ్రీనివాసరావు, ఎల్.మన్మథరావు, కె.భోజరాజు, ప్రదీప్‌కుమార్



పి.సత్యనారాయణ, వై.ఆనందరావు, ఇ.తవిటినాయుడు, ఆర్.రమణ

అనకాపల్లి రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి):
ఉగాది పండుగను పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పోలీస్ సేవా పతకాలకు జిల్లాలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న ఎనిమిది మంది పోలీసు ఉద్యోగులు ఎంపికయ్యారు. స్పెషల్ బ్రాంచిలో ఏఎస్ఐగా పనిచేస్తున్న బి.శ్రీనివాసరావు ఉత్తమ సేవా పతకానికి ఎంపిక కాగా, ఏఆర్ ఇన్‌స్పెక్టర్ ఎల్.మన్మథరావు, ఏఆర్ ఏఎస్ఐ కె.భోజరాజు, అనకాపల్లి సీసీఎస్ పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ కేజేబీజీ ప్రదీప్‌కుమార్, అనకాపల్లి టౌన్ పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ పి.సత్యనారాయణ, ఏఆర్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వై.ఆనందరావు, కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఇ.తవిటినాయుడు, నర్సీపట్నం రూరల్ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ ఆర్.రమణ సేవా పతకాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వీరిని ఎస్పీ తుహిన్‌సిన్హా అభినందించారు.

సాగునీటి వనరులకు మోక్షం

'మాకవరపాలెం'లో వివిధ పనులకు రూ. 3.16 కోట్లతో ప్రతిపాదనలు

- నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభం
- ఖరీఫ్ మొదలయ్యేనాటికి పూర్తిచేస్తామని జేఈ వెల్లడి



తూటిపాల గెడ్డ వరద ఉధృతికి కొట్టుకుపోయిన గ్రోయిన్ (ఫైల్)

మాకవరపాలెం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి):
మండలంలో పది సాగునీటి వనరులకు మరమ్మతులు, నిర్వహణ పనులకు నిధులు మంజూరు చేయాలని ఇరిగేషన్ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభించి, ఖరీఫ్ ఆరంభం నాటికి పూర్తి చేస్తామని చెబుతన్నారు.



జి.కోడూరులో కొట్టుకుపోయిన ఆనకట్ట గోడను పరిశీలిస్తున్న ఇరిగేషన్ జేఈ రామన్నపాత్రుడు (ఫైల్ ఫొటో)

మండలంలో పలు సాగు నీటి వనరులు వైసీపీ ప్రభుత్వ హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయి. కాలువలు, గ్రోయిన్లు వంటివి వాటికి నిర్వహణ కొరవడి పొలాలకు నీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జి.కోడూరులో జాగారాల గెడ్డ ఆనకట్ట కింద 300 ఎకరాల ఆయకట్టు వుంది. నాలుగేళ్ల క్రితం వరద ఉధృతికి గట్టు కొట్టుకుపోయింది. దీంతో సమీపంలోని పొలాల్లో ఇసుక మేటలు వేసింది. వైసీపీ అధికారంలో వున్నంత వరకు దీనికి మరమ్మతులు చేపట్టలేదు. అలాగే తూటిపాల గుడబాల గెడ్డ గ్రోయిన్ ఐదేళ్ల కిందట వరదలకు కొట్టుకుపోయింది. దీనికింద సుమారు 400 ఎకరాల ఆయకట్టు ఉంది. గ్రోయిన్ పునర్నిర్మాణం చేపట్టకపోవడంతో రైతులు వర్షాలపై ఆధార పడి పంటలు సాగు చేసుకోవాల్సి వస్తున్నది. మామిడిపాలెం రిజర్వాయర్‌లో పూడిక పేరుకుపోయి వచ్చిన నీరు వచ్చినట్టే బయటకు పోతున్నది. చిన రాచపల్లి రిజర్వాయర్ గేట్లు మరమ్మతులకు గురికావడంతో నీరు వృథాగా పోతున్నది. పంట చేతికి వచ్చే దశలో నీరు లేక రైతులు ఇబ్బంది పడుతున్నారు. గిడుతూరు చుక్కలయ్య చెరువు సాగునీటి కాలువ పూర్తిగా పూడుకుపోయింది. ఏటా రైతులు నిధులు సమకూర్చుకొని పూడిక పనులు ... మిగతా 8వ పేజీలో

సీఎం చంద్రబాబును కలిసిన అచ్యుతాపురం నాయకులు



ముఖ్యమంత్రికి చిత్రపటమిస్తున్న నాయకులు

అచ్యుతాపురం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని మంగళవారం మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, అచ్యుతాపురం మండలం ఖాజీపాలేనికి చెందిన ఉమ్మడి విశాఖ జిల్లా టీడీపీ కార్యదర్శి పీలా తులసీరామ్, మండల జనసేన నాయకుడు పీలా సందీప్ మర్యాదపూర్వకంగా కలిశారు. పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు.

'పాత ఆస్పత్రి భవనంలో ప్రసూతి విభాగం ఏర్పాటు చేయాలి'

ఎలమంచిలి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాత ప్రభుత్వ ఆస్పత్రి (సీహెచ్‌సీ) భవన సముదాయంలో ఓపీ, ప్రసూతి విభాగం, అత్యవసర విభాగాలను ఏర్పాటు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి శివాజీ కోరారు. మంగళవారం ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయన మాట్లాడుతూ తులసీనగర్‌లో నూతనంగా నిర్మించిన ఆస్పత్రికి రాకపోకలకు రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ స్థితిలో పాత ఆస్పత్రి భవనంలో అత్యవసర విభాగం, ప్రసూతి విభాగాన్ని ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్ వరహాలుకు వినతి ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ ప్రతినిధులు జానకి, నూకరత్నం, లక్ష్మి పాల్గొన్నారు.

కార్మిక శాఖ అధికారి తనిఖీలు

అచ్యుతాపురం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): 18 ఏళ్లు నిండని బాలలను పనిలో నియమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కార్మిక శాఖ అధికారి వెంకటేశ్వరరావు హెచ్చరించారు. మంగళవారం అచ్యుతాపురంలో చైల్డ్ లేబర్ డ్రైవ్ నిర్వహించారు. ఈసందర్భంగా హోటళ్లు, షాపులు, కర్మాగారాల్లో తనిఖీ చేశారు. జిల్లా బాలల పరిరక్షణ ప్రతినిధి డి. లోవరాజు, మహిళా పోలీస్ దుర్గాభవానీ, డి . రమ, తదితరులు పాలొన్నారు.

రోడ్ల అభివృద్ధిపై 'ప్రగడ' సమీక్ష

అచ్యుతాపురం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): విజయవాడ తన కార్యాలయంలో ఏపీ రహదారులు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వర రావు మంగళవారం బ్యాంకు అధికారులతో సమీక్ష జరిపారు. రాష్ట్రంలో పలు రోడ్ల నిర్మాణం, రుణ సదుపాయాలపై చర్చించారు. బ్యాంక్ అధికారులతో పాటు ఎండీ శ్రీనివాస రెడ్డి ఉన్నారు.



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రమాకుమారి



సమావేశంలో పలు సమస్యలపై ప్రశ్నిస్తున్న వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, గుప్తా

అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం తగదు

▸▸ మున్సిపల్ సమావేశ మందిరం పనులపై పాలకవర్గ సభ్యులు ఆగ్రహం

ఎలమంచిలి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనుల నిర్మాణంలో నిర్లక్ష్యం వహించడం తగదని స్థానిక మున్సిపల్ పాలకవర్గ సభ్యులు మండిపడ్డారు. మంగళవారం చైర్‌పర్సన్ రమాకుమారి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మునిసిపల్ నివేదికను కార్యాలయాధికారి సమావేశంలో చదివి వినిపించారు. అనంతరం పలువురు సభ్యులు మాట్లాడుతూ, మునిసిపల్ కౌన్సిల్‌హాలు నిర్మాణానికి లక్షలాది రూపాయలు మంజూరైనా నిర్మాణానికి నోచుకోలేదన్నారు. మునిసిపల్ కౌన్సిల్ సమావేశ హాలు నిర్మాణానికి 6 ఏళ్ల కిత్రం సుమారు రూ. 50 లక్షల కేటాయించినా ఇంతవరకూ అడుగు ముందుకు పడలేదని వైస్ చైర్మన్ ఆరెపు నాగ త్రినాధ గుప్తా ప్రశ్నించారు. దీంతో కౌన్సిల్ సమావేశం కోసం తీసుకుంటున్న భవవానికి ప్రతి నెలా వేలాది రూపాయలు అద్దె రూపంలో చెల్లించాల్సివస్తోందన్నారు. ఈ భవనంలో వస్త్రాలు కట్టి సమావేశాలు నిర్వహణపై అసంతృప్తి వ్యక్తంచేశారు. ఇకపై ఇలా నిర్వహిస్తే.. సమావేశాన్ని బహిష్కరించాల్సి ఉంటుందని హెచ్చరించారు. విండ్ పవర్ యూనిట్ ఏళ్ల తరబడి వృధాగా ఎందుకు వదిలేశారని ప్రశ్నించారు. పట్టణంలో వన్ వే నిబంధనలు ఉన్నా సరే పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోవడంలేదన్నారు. పెదపల్లి వద్ద రైల్వే గేటు పడిన ప్రతిసారీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మాజీ సైనికులకు ఇళ్ల పన్ను మినహాయింపై స్పష్టత ఇవ్వాలని వైస్ చైర్మన్ బెజవాడ నాగేశ్వరావు కౌన్సిల్ ఈ సందర్భంగా కోరారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో నిర్మించిన దుకాణ సముదాయాల పన్ను వివరాలు తెలపాలన్నారు. పట్టణంలో కొన్ని చోట్ల నిబంధనల విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నా సరే పట్టించుకోవడం లేదని 10 వ వార్డు కౌన్సిలర్ అన్నారు. యర్రవరం శ్మశాన వాటికలో విద్యుత్ సదుపాయం కల్పించాలని కౌన్సిలర్ పిట్టి సత్తిబాబు కోరారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు గాను చైర్‌పర్సన్ రమాకుమారి మాట్లాడుతూ కౌన్సిల్ సమావేశ హాలు నిర్మాణానికి రూ. 50 లక్షలు మంజూరయ్యాయన్నారు. అయితే, ఇప్పటికి ఎనిమిది సార్లు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాలేదన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్తామన్నారు.విండ్ పవర్ యూనిట్ విషయంపై పరిశీలించాలని, ఆర్టీసీ బస్టాండ్ వద్ద అనుమతులు లేకుండా నిర్మించిన నిర్మాణానికి నోటీసు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పలు అభివృద్ధి కార్యక్రమాలపై తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ప్రసాదరాజు, మునిసిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలపై నిరసన

అచ్యుతాపురం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్. శంకరరావు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సెజ్‌పునరావాస కాలనీలో నిర్వాసితుల, ఇతర సమస్యలపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలను అధికారులు పట్టించుకోవటం లేదన్నారు. గ్రామాల్లో ఉపాధి హామీ పనులు లేకకూలీలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మత్స్యకారులు వేట నిషేధ భృతి ఇవ్వలేదన్నరు. అలాగే బాబా ఆటమిక్ రీసెర్చ్ సెంటర్ (బార్క్) నిర్వాసితుల సమస్యలు ఏళ్లు గడుస్తున్నా పరిష్కరించలేదన్నారు. నాయకులు రొంగలి రాము, కె. సోమునాయుడు, బుద్ద రంగారావు, చేపల తాతయ్యలు, ఆర్ లక్ష్మి, కృష్ణ పాల్గొన్నారు.

రహదారి నిర్వాసితులు...

మునగపాక: అనకాపల్లి-అచ్యుతాపురం రహదారి నిర్వాసితుల సమస్య పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట పలువురు బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఈ రహదారితో నష్టపోతున్న సుమారు 1200 మందికి పరిహారం అందించాలన్నారు. అనంతరం డీటీకి వినతి పత్రం అందజేశారు. ఆడారి గణపతి అచ్చింనాయుడు, పలువురు సర్పంచులు, ఎంపీటీలు పాల్గొన్నారు.



మునగపాక తహసీల్దార్ కార్యాలయం వద్ద బైఠాయించిన వైసీపీ శ్రేణులు

తాగునీటి సమస్యలపై నిరసన

రాంబిల్లి: గ్రామాల్లో తాగునీటి, ఇతర సమస్యలు పరిష్కారం కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక తహసీల్థార్ కార్యాలయం వద్ద ఖాళీబిందెలతో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.లోకకాథం మాట్లాడుతూ మండలంలోని లోవపాలెం, యాతకొత్తపట్నం, నేవీకాలనీ, అప్పారాయుడుపాలెం, లాలంకోడూరు, చినకలవలాపల్లిల్లోని ప్ర జలు తాగునీటి సమస్యలతో ఇబ్బంది పడుతున్నారన్నారు. ఉపాధి కూలీలకు కూలి చెల్లించలేదన్నారు. లాలంకోడూరు, కృష్ణంపాలెం, జడ్ చింతువ గ్రామాల ప్రజలు ఫార్మా కంపెనీల కాలుష్యతో అనారోగ్యాలతో ఇబ్బంది ఎదుర్కొంటున్నారన్నారు.

అంగన్‌వాడీలకు శిక్షణ

రాంబిల్లి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తూరు జడ్పీ హెచ్ స్కూల్లో మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్ భీ. పడాయి భీ పై రెండో బ్యాచ్‌కు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీడీపీవో లలితకుమారి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఎస్‌వీఎస్ రాణి, మాలతీదేవి మాట్లాడుతూ, ఆరేళ్లలోపు పిల్లలకు పోషణ, పూర్వ ప్రాథమిక విద్యపై శ్రద్ధ చూపాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అచ్యుతాపురం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కొండకర్ల సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతు పనులు జరుగుతున్నందున బుధవారం ఉదయం9 నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని అనకాపల్లి డివిజన్ ఈఈ కె. రాజశేఖర్ తెలిపారు. కొండకర్ల జంక్షన్, ఎర్రవరం, ఉప్పవరం, మల్లవరం, నరేంద్రపురం, ఎంజేపురంల వినియోగదారులు సహకరించాలని కోరారు.

పాఠశాలకు బెంచీలు వితరణ

అచ్యుతాపురం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పూడిమడక ఉన్నత పాఠశాలకు సెజ్‌లోని ఐమెరీస్ కర్మాగారం ప్రతినిధి గ్రీక్ ఆధ్వర్యంలో 50 బెంచీలు మంగళవారం వితరణగా అందజేశారు. తమ ఫౌండేషన్ ద్వారా మరిన్ని సేవలందిస్తామని ఈసందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బజ్జారీ, హెచ్‌ఎం రామశేష తదితరులు పాల్గొన్నారు.

'బాల్య వివాహాలను ప్రోత్సహించవద్దు'

రాంబిల్లి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను ఎవరూ ప్రోత్సహించరాదని బాలల పరిరక్షణ జిల్లా ప్రతినిధి డి.లోవరాజు అన్నారు. మంగళవారం మండలంలోని మామిడివాడలో చైల్డ్ వెల్ఫేర్ అండ్ ప్రొటక్షన్ కమిటీని ఏర్పాటు చేసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బాల్య వివాహాలు వలన కలిగే నష్టాలను తెలియజేశారు. పేద విద్యార్థులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే టట్లు చూడాలని, బడి బయట పిల్లల తిరిగి పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. గ్రామపెద్దలు, మహిళలు పాల్గొన్నారు..

లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ



చెక్కులుఅందజేస్తున్న ఎమ్మెల్యే విజయ కుమార్

అచ్యుతాపురం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్‌ని ఎమ్మెల్యే సుందరపు విజయ కుమార్ స్థానిక తన నివాస గృహంలో మంగళవారం అందించారు. మండలంలోని చోడిపల్లి శాంతికి రూ. 58.400లు వరద ఆనందరావుకు రూ.1.22.220 ల క్షలు, వారిశెట్టి నూకరాజుకి రూ.45,350, మునగపాక మండలం పసుపులేటి యశోదకి రూ 2.11.576, టెక్కలి శ్యాం సుందర్‌కి రూ. 50 వేలు, వల్లూరి హర్షితకు రూ. 50,950లు, రాంబిల్లి మండలం లాలం లక్ష్మికి రూ. 30,786, వెదుళ్ల సంజీవికి రూ. 41,112లు, గురుబిల్లి ధనమ్మకు రూ. 45,700, ఎలమంచిలి మండలం అంకిరెడ్డి అప్పారావుకి రూ. 46,267, సిగిరెడ్డి కృష్ణకి రూ. 50,592లు, కర్రి నాగజ్యోతిగోపి నాయుడుకి రూ. 2,04,430 మొత్తం రూ. 10.17 లక్షలు పంపిణీచేశారు.

త్వరలో ఉమెన్ ఫ్రెండ్లీ సెంటర్లు : ఎమ్మెల్యే

త్వరలో ఉమెన్ ఫ్రెండ్లీ సెంటర్లు ప్రారంభిస్తున్నట్టు స్థానిక ఎమ్మెల్యే విజయ కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రయాణ సమయంలో మహిళలు తీవ్ర ఇబ్బందులు లేకుండా ఈ సెంటర్లలో మరుగు దొడ్లు, విశ్రాంతికి వీలుకల్పిస్తామన్నారు. ముందుగా మండలంలోని చోడపల్లిలోఈ సెంటర్‌ని ఏర్పాటు చేస్తామన్నారు.

ఘనంగా పరదేశమ్మ పండుగ



పరదేశమ్మను దర్శించుకున్న భక్తులు

మునగపాక, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక పరదేశమ్మ పండుగ మంగళవారం ఘనంగా జరిగింది. అమ్మవారిని దర్శించుకునేందుకు వేకువజాము నుంచి భక్తులు బారులు తీరారు. జాతరలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు, ప్రత్యేక రథం భక్తులను ఆకట్టుకున్నాయి. సతకంపట్టు గౌరీపరమేశ్వరులు ఆ లయం వద్ద ప్రదర్శించిన రైతుపోరాటం', సంతబయల విశాలాంధ్ర వేదికపైన 'అద్దంలో చందమామ' నాటికలు అలరించాయి. గ్రామ పురవీధుల్లో అమ్మవారి ఉత్సవ ఊరేగింపు జరిగింది.

నేడు ఎలమంచిలిలో 'జనవాణి'

ఎలమంచిలి: స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులోని జనసేన పార్టీ కార్యాలయం ఆవరణలో బుధవారం ఉదయం 10 గంటల నుంచి జనవాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ ప్రతినిధి తెలిపారు. ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, అన్ని శాఖల అధికారులతో పాల్గొంటారని తెలిపారు. ప్రజలు సమస్యలను దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

64 మందికి నేత్ర పరీక్షలు



కంటి ఆపరేషన్‌కు బస్సులో విశాఖ తరలిస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సర్వసిద్ధి పీహెచ్‌సీలో మంగళవారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో 64 మందికి పరీక్షలు జరిపినట్టు కంటి వైద్య నిపుణులు డాక్టర్ బొండా వెంకటరావు తెలిపారు. విశాఖ శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ శిబిరంలో 17 మందిని ఉచిత కంటి ఆపరేషన్ల నిమిత్తం విశాఖ ఆస్పత్రికి తరలించినట్టు డాక్టర్ వెంకటరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు, వైద్య సిబ్బంది, శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

నేడు రెండు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎస్.రాయవరం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొరుప్రోలు సబ్ స్టేషన్ పరిధిలో గోకులపాడు ఫీడర్లలో గల గోకులపాడు, భీమవరం గ్రామాల్లో బుధవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. ఆర్‌డీఎస్ఎస్ పనుల్లో భాగంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు



అరట్లకోటలో నిర్వహిస్తున్న పొలం పిలుస్తోంది కార్యక్రమం

పాయకరావుపేట రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రబీ వరి సాగులో సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి పి. ఆదినారాయణ అన్నారు. మండలంలోని పెదరాంభద్రపురం, పాయకరావుపేటలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రబీ వరిలో తీసుకోవలసిన సస్యరక్షణ చర్యలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది జి.వందన, ఆర్.సాధన, రైతులు పాల్గొన్నారు.

'సంపద తయారీ కేంద్రాలను వినియోగించాలి'

పాయకరావుపేట రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగించాలని ఈవోపీఆర్‌డీ సీహెచ్ చంద్రశేఖరరావు అన్నారు. మండలంలోని నామవరం, మంగవరం, పెదరాంభద్రపురం గ్రామాలలోని సంపద తయారీ కేంద్రాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటి నుంచి చెత్తను సేకరించి సంపద కేంద్రాలకు తరలించాలన్నారు. సంపద తయారీ కేంద్రాలలో తయారైన వర్మీ కంపోస్టును రైతులు కొనుగోలు చేసేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు కొండలరావు, దుర్గాప్రసాద్, మల్లికార్జునాచారి పాల్గొన్నారు.

డీఎల్ పురం డీ పట్టాదారుల ఆందోళన

నక్కపల్లి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): తమకు న్యాయం చేయాలంటూ డీఎల్‌పురం డీ పట్టాదారులు మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి జి. కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు మాట్లాడుతూగ్రామంలోని 193 నుంచి 199 సర్వే నంబరు వరకూ పూర్వం నిరుపేదలకు 64 ఎకరాలు డీ పట్టాలను ప్రభుత్వం అందజేసిందన్నారు. ఈ భూములను కారిడార్ కోసం సేకరించిన ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిర్వాసిత రైతులకు పరిహారం ఇవ్వకుండా పనులు చేయించడం తగదన్నారు. బల్క్‌డ్రగ్ కోసం అదనంగా భూములు సేకరించే ప్రతిపాదనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో సర్పంచ్ కిల్లాడ కృష్ణ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గింజాల వెంకట రమణ, ఎం.రాజేశ్, వేగేశ్న కృష్ణంరాజు, ఏడిద రమణ, అప్పారావు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న నిర్వాసిత రైతులు

ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ నూతన కార్యవర్గం

పాయకరావుపేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఏపీ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. మంగళవారం మండలంలోని నామవరంలో సావిత్రి సాంస్కృతిక కళ్యాణ వేదికలో అసోసియేషన్ అధ్యక్షుడు జి.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షునిగా బీడీవీవీ.ప్రసాద్, అధ్యక్షునిగా నల్లల చలపతిరావు, అసోసియేట్ అధ్యక్షునిగా చించలపు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా పోతు చిట్టిబాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా చక్కా వెంకటరమణమూర్తి, కోశాధికారిగా గంటి రాజ్యశ్రీ, ఉపాధ్యక్షులుగా గణసాల వెంకటేశ్వరరావు, బీవీ.ప్రసన్నకుమార్, కట్టా శ్రీనివాసరావు, ఆర్‌వీవీ.ప్రభాకరరావు, సహాయ కార్యదర్శులుగా శ్రీపాద సత్యనారాయణ, గెడ్డం సత్యనారాయణ, ఎం.మహంతయ్య, కె.సుందరరావు, ఎగ్జిక్యూటివ్ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. అలాగే ఇటీవల మృతిచెందిన ఆర్‌వీ.రమణయ్య కుటుంబానికి అసోసియేషన్ తరపున రూ.75,050 ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంఘం అధ్యక్షులు వి.జగన్నాథరావు, ప్రధాన కార్యదర్శి బీఎల్ఎన్.శర్మ, రాష్ట్ర కార్యదర్శి సోమేశ్వరరావు, జి.సాంబశివరావు, వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.



నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం చేస్తున్న దృశ్యం

వైభవంగా దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం



దుర్గాదేవికి పూజలు చేస్తున్న టీడీపీ నాయకుడు ఎన్. వెంకటరాజు తదితరులు

ఎస్.రాయవరం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదఉప్పలం దుర్గాదేవి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం మంగళవారం గ్రామస్థులు వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో అమ్మవారికి పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు ఎన్. వెంకటరాజు అమ్మవారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు కమిటీ సభ్యులు ప్రసాద వితరణ చేపట్టారు. మధ్యాహ్నం నుంచి అమ్మవారి ఆలయం వద్ద అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.

కోటవురట్లలో వర్షం

కోటవురట్ల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో మార్పుల కారణంగా మంగళవారం సాయంత్రం 6 గంటలప్రాంతంలో పలు గ్రామాల్లో వర్షం కురిసింది. ఈ వర్షంతో మామిడి, జీడిమామిడి తోటల లేతపూత రాలిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మూడు నెలల తర్వాత వర్షం కురవడంతో ప్రజలు ఆనందం వ్యక్తంచేశారు. ఈ వర్షం వేరుశనగ, కూరగాయలు సాగుకు మంచి ఉపయోగపడుతుందని రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

'పాడి రైతులు సంఘాలుగా ఏర్పడాలి'

ఎస్.రాయవరం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులు సంఘాలుగా ఏర్పడాలని స్థానిక పశువైద్యాధికారులు డాక్టర్ హన్నాకుమారి, డాక్టర్ భరత్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక పశువుల ఆస్పత్రిలో జరిగిన అభ్యుదయ పాడి రైతుల సమావేశంలో వారు మాట్లాడుతూ సంఘాల సభ్యులు పరస్పరంగా సహకరించుకొని పాడి అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. సంఘమిత్రకు సంబంధించిన షేర్‌లు తీసుకొని, వాటి ద్వారా మేలుజాతి, బాహువార్షిక పశుగ్రాసాలను పెంచుకొనేందుకు అవకాశం ఉంటుందన్నారు. తక్కువ ఖరీదుకు నాణ్యమైన దాణాలు, నాణ్యమైన ఎరువులు, పురుగుల మందులు తక్కువ ధరకు అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘమిత్ర వైస్ ప్రెసిడెంట్ ఆళ్ల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌తో నష్టాలపై విద్యార్థులకు అవగాహన

పాయకరావుపేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : పాయకరావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని వసతి గృహాల విద్యార్థులకు డ్రగ్స్ వినియోగం వలన కలిగే నష్టాలను తెలియజేస్తూ వీడియో ప్రదర్శన ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా పోలీసులు మంగళవారం పట్టణంలోని ఎస్సీ, బీసీ, బీసీ కాలేజి బాలుర, బాలికల వసతి గృహాల వద్ద డిజిటల్ స్క్రీన్ ద్వారా విజువల్స్ రూపంలో డ్రగ్స్ వినియోగం వలన కలిగే నష్టాలు, సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించారు.



ఎస్సీ బాలుర వసతి గృహ విద్యార్థులకు వీడియో ద్వారా ప్రదర్శిస్తున్న దృశ్యం

గూడుపమ్మను దర్శించుకున్న ఎంపీడీవో

నక్కపల్లి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేబాక గూడుపమ్మ క్షేత్రాన్ని మంగళవారం మధ్యాహ్నం ఎంపీడీవో డి. సీతారామరాజు దర్శించుకున్నారు. గోత్రనామాలతో పూజలు నిర్వహించారు.అనంతరం ఆలయ ధర్మకర్త అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రంతో ఎంపీడీవోను సత్కరించారు. ఆయన వెంట ఉపాధి పథకం ఏపీవో భాగ్యలక్ష్మి, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది వున్నారు.

చినరాంభద్రపురంలో రీ సర్వే గ్రామసభ



గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ నర్సింహమూర్తి

నక్కపల్లి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినరాంభద్రపురంలో మంగళవారం భూముల రీ-సర్వేపై గ్రామసభ నిర్వహించారు. రీసర్వేపై రైతులకు తహసీల్దార్ నర్సింహమూర్తి అవగాహన కల్పించారు. అంతకుముందు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. మాజీ ఎంపీపీ దేవర సత్యనారాయణ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ

నక్కపల్లి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పోషణ భీ పఢాయి భీ కార్యక్రమంలో భాంగా మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీవో శ్రీవిద్య నేతృత్వంలో సూపర్‌వైజర్ కె.లలిత పిల్లల్లో పోషకాహారం లోపాన్ని గుర్తించడం, సమతుల్య ఆహారం ప్రాముఖ్యత తెలియజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పీపీఎల్ క్రికెట్ టోర్నీ విజేత నాని విలేజ్ కింగ్స్



పీపీఎల్ క్రికెట్ విజేత జట్టుకు కప్‌ను అందజేస్తున్న దృశ్యం

పాయకరావుపేట రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరాంపురంలో నిర్వహించిన పీపీఎల్ క్రికెట్ టోర్నీ విజేతగా నిలిచిన నాని విలేజ్ కింగ్స్ జట్టుకు టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, సీఐ జి.అప్పన్న కప్‌ను సోమవారం రాత్రి అందజేశారు. టీడీపీ నాయకుడు చించలపు ప్రదీప్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ టోర్నీలో 10 జట్లు పాల్గొన్నాయి. సోమవారం జరిగిన పోటీలో విన్నర్‌గా నాని విలేజ్ కింగ్స్ జట్టు, రన్నర్‌గా ఎస్ఎస్ సోల్జర్స్ జట్టు విజయం సాధించాయి. మ్యాన్ ఆఫ్ ద టోర్నమెంట్, మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్, తదితర విభాగాలకు ప్రైజ్ మనీ, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెదిరెడ్డి శ్రీను, బొంది కాశీవిశ్వనాథ్, వేములపూడి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు అవగాహన

నక్కపల్లి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక పశువుల ఆస్పత్రిలో మంగళవారం అభ్యుదయ పాడిరైతుల సమావేశం నిర్వహించారు. పశు వైద్య సంచాలకులు డాక్టర్ ఎం.వీర్రాజు రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందడం, పాడి రైతులంతా సంఘాలుగా ఏర్పడి ఒకరికొకరు సహకరించుకోవడంపై వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ జయచంద్ర,డాక్టర్ సౌజన్య, డాక్టర్ కృపావతి పాల్గొన్నారు.


కరపత్రాలు విడుదల చేస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

మెగా జాబ్‌మేళాను వినియోగించుకోండి

» స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనే ధ్యేయంగా రిషి కళాశాలలో బుధవారం నిర్వహిస్తున్న మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పిలుపునిచ్చారు. మంగళవారం క్యాంప్ కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వాహకులతో కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్ మేళాలో 1800 ఖాళీలు భర్తీ చేయడానికి 18 బహుళ జాతీయ కంపెనీలు పాల్గొంటున్నాయని తెలిపారు. పదో తరగతి నుంచి పీజీ చదువుకున్న యువతీ యువకులు ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎస్.గోవిందరావు, కళాశాల కరస్పాండెంట్ సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ విద్యార్థికి లక్ష్యం అవసరం

» అడిషనల్ ఎస్పీ హనుమంతు


సదస్సులో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ హనుమంతు

చోడవరం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ప్రతీ విద్యార్థికి లక్ష్యం అవసరమని, లక్ష్యం లేని చదువు వల్ల ఫలితం ఉండదని గుంటూరు అడిషనల్ ఎస్పీ (ఏఆర్) హనుమంతు చెప్పారు. స్థానిక ఉషోదయ డిగ్రీ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. క్రమశిక్షణ, సంస్కారం విద్యార్థులకు ఎంతో అవసరమని, ఇవి ఉంటే జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించడం సాధ్యమని చెప్పారు. ఈ సందర్భంగా తన చిన్నతనంలో చదువుకోవడానికి అనుభవించిన కష్టాలు, వాటిని అధిగమించిన తీరును విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జె. రమణాజీ, కరస్పాండెంట్ కృష్ణకుమారి, డీఎస్పీ వాసు, ప్రిన్సిపాల్ నాయుడు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు పరిశీలన


సీసీ కెమెరాల ఏర్పాటుకు స్థల పరిశీలిస్తున్న సీఐ అప్పలరాజు

చోడవరం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకన్నపాలెంలో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం సీఐ బి.అప్పలరాజు మంగళవారం పరిశీలన చేశారు. విశాఖపట్నం, అనకాపల్లికి జంక్షన్ వెంకన్నపాలెం మీదుగా వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగుతున్నందున, ఇక్కడ సీసీ కెమెరాలు ఎక్కడ ఏర్పాటు చేయాలని స్థానికులతో చర్చించారు. ఈ సందర్భంగా సీసీ కెమెరాల నిర్వహణకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మొల్లి ఈశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు ఎం.రమణ, స్థానిక నేత సియ్యాద్రి జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

కోటవీధి సమస్యలపై మహిళల నిరసన


పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న మహిళలు

చోడవరం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పంచాయతీలోని కోటవీధి పరిసర ప్రాంతాల్లో తాగునీటితో పాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ జిల్లా కార్యదర్శి గూనూరు వరలక్ష్మి ఆధ్వర్యంలో మహిళలు మంగళవారం ఆందోళనకు దిగారు. కోటవీధిలో కొళాయిలు ద్వారా తాగునీరు రావడం లేదని, వీధి దీపాలు వెలగడం లేదని, డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో దోమల బెడద ఎక్కువగా ఉందని మహిళలు మండిపడ్డారు. అధికారులు స్పందించి వెంటనే తగిన చర్యలు చేపట్టాలని వరలక్ష్మి డిమాండ్ చేశారు. అనంతరం ఈవో నారాయణరావుకు వినతిపత్రం అందజేశారు. విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని, తాగునీరు సక్రమంగా వచ్చేలా చూస్తామని ఈవో హామీ ఇచ్చారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ దాడి ఎరుకునాయుడు

కె.కోటపాడు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ దాడి ఎరుకునాయుడు సూచించారు. మండలంలోని చౌడువాడ సంపద కేంద్రం వద్ద నియోజకవర్గంలోని నాలుగు మండలాల పారిశుధ్య కార్మికులు, క్లాప్‌మిత్రల శిక్షణ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలకు ఆదాయ వనరులుగా సంపద కేంద్రాలు తీర్చిదిద్దాలన్నారు. గ్రామాల పరిశుభ్రతకు పారిశుధ్య కార్మికులు చేస్తున్న కృషి మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పి.సురేశ్‌బాబు, ట్రైనీ జె.చినబాబు, సచివాలయ ఉద్యోగులు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

జీడి పంటకు మద్దతు ధర ఇవ్వాలని ఆందోళన


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

దేవరాపల్లి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): జీడి పంటకు మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం రైతులు ఆందోళనకు దిగారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న మాట్లాడుతూ జీడి పంటకు మద్దతు ధర లేక రైతులు నష్టపోతున్నారన్నారు. దళారులు నచ్చిన ధరకు తీసుకుంటున్నారని వాపోయారు. ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆదుకోవాలని ఆయన కోరారు. అనంతరం అనంతరం తహసీల్దార్ పి.లక్ష్మీదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు దేముడు, సిహెచ్.ఎర్నాయుడు, బి.టి.దొర, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇదేనా స్వచ్ఛత..?

గ్రామాల్లో పారిశుధ్య లోపం
ప్రధాన రహదారులపైనే పేరుకుపోతున్న చెత్తా చెదారం
భరించలేని దుర్వాసనతో జనం అగచాట్లు
పట్టించుకోని అధికారులు, పాలకులు


ఘాట్ రోడ్డు జంక్షన్‌లో వాడపాడు రోడ్డులో పేరుకుపోయిన చెత్త కుప్పలు

మాడుగుల రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ కొరవడుతోంది. ఎక్కడికక్కడే చెత్తా చెదారం పేరుకుపోతోంది. ప్రధాన రహదారుల పక్కన గుట్టలుగా దర్శనమిస్తోంది. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వచ్ఛత కార్యక్రమం ఇక్కడ చిరునామా లేకపోతోంది.

మండలంలోని పలు గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ కొరవడుతున్నది. రోడ్డు పక్కనే చెత్తాచెదారాలు, వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. అవి కుళ్లిపోయి భరించలేని దుర్గంధం వెదజల్లడంతో పాటు రోగాలు ప్రబలుతున్నాయి. ప్రధానంగా వీరనారాయణం, ఘాట్ రోడ్డు జంక్షన్ నుంచి వాడపాడు వెళ్లే వైపు, జంపెన గ్రామాల్లో రోడ్డు పక్కనే చెత్తాచెదారం పేరుకుపోయి దర్శనమిస్తోంది. ఇళ్లలోని వాడిన పాలిథిన్ కవర్లు, ఇతరత్రా వ్యర్థాలు, దుకాణాల్లో వాడిన డిస్పోజల్ గ్లాసులు, ప్లేట్లు తీసుకువచ్చి రోడ్డు పక్కనే పారేస్తున్నారు. దీనిపై పంచాయతీ పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.


వీరనారాయణం వద్ద రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తాచెదారం

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు ఉన్నప్పటికీ ఏదో తూతూమంత్రంగా తప్పితే పూర్తిస్థాయిలో ఉపయోగపడడం లేదు. సేకరించిన చెత్తను పారిశుధ్య కార్మికులు సంపద కేంద్రాలకు తరలించకుండా రోడ్డు పక్కనే పారేస్తున్నారు. సరికదా వాటికి నిప్పు పెడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గ్రామాల్లోని ప్రజలు కూడా చెత్తను పాలిథిన్ సంచులతో తెచ్చి రోడ్డు పక్కనే పారేస్తున్నారు. చాలా చోట్ల రోడ్డు పక్కన చెత్తాచెదారం పేరుకుపోతోంది. దీంతో ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. అయినప్పటికీ అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకునే పాపాన పోవడం లేదు. ఇప్పటికైనా మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో పారిశుధ్య పరిరక్షణకు అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

డి.పట్టా భూములను వెనక్కి తీసుకోవాలని ధర్నా


ఎస్టీల భూములకు రక్షణ కల్పించాలని చేతులు జోడించి నినదిస్తున్న గిరిజనులు

రావికమతం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన అడ్డగోలు రీ సర్వేతో అన్యాక్రాంతమైన గిరిజనుల డి.పట్టా భూములను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పలు గ్రామాల గిరిజనులు ధర్నా చేశారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు మాట్లాడుతూ కవ్వగుంట, కొట్నాబిల్లి గ్రామాలలో నిరుపేద గిరిజనులకు ప్రభుత్వం ఇచ్చిన డి.పట్టా భూముల్లో డొంకలు కొట్టి జీడిమామిడితోటల సాగుతో జీవనోపాధి పొందుతున్నారని, రీ సర్వే పేరుతో పట్టాదారు పేర్లను వెబ్‌ల్యాండ్‌లో తొలగించారని ఆరోపించారు. ఎన్నో ఏళ్లుగా సాగులో ఉండి డి.పట్టాలు కలిగిన కవ్వగుంట గిరిజనులకు చెందిన 20 ఎకరాల భూములను గిరిజనేతర రియల్ ఎస్టేట్ కుటుంబాల పేరున పట్టాలు ఇచ్చారని మండిపడ్డారు. దీనిపై అనేక సార్లు ఫిర్యాదులు చేసినా రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. వెబ్‌ల్యాండ్‌లో జరిగిన అక్రమాలపై ఇప్పటివరకూ సంబంధిత అధికారులపై కనీస చర్యలు తీసుకోకపోవడం దారుణమని ఆయన దుయ్యాబట్టారు. ఈ అక్రమాలపై జేసీతో విచారణ చేపట్టి గిరిజనులకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ వెంకటరమణకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు పాంగి చంద్రయ్య, పీవీటీజీ సంఘ నాయకులు గెమ్మిలి వాసు, ఆదివాసీలు పాల్గొన్నారు.

కూలికి టోకరా పెట్టిన ట్రాన్స్‌పోర్టు ఆపరేటర్‌పై చర్యలు తీసుకోవాలి

చోడవరం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): చెరకు కాటాల వద్ద కూలీల వేతనాలకు ఎగనామం పెట్టిన గోవాడ షుగర్ ఫ్యాక్టరీ లారీ ట్రాన్స్‌పోర్టు ఆపరేటర్‌పై చర్యలు తీసుకోవాలని జిల్లా సీఐటీయూ నాయకులు వి.వి.శ్రీనివాసరావు, గూనూరు వరలక్ష్మి డిమాండ్ చేశారు. మంగళవారం విలేకరులతో వారు మాట్లాడుతూ కూలీలకు డబ్బులు చెల్లించకుండా ట్రాన్స్‌పోర్టు ఆపరేటర్ వెళ్లిపోవడం దుర్మార్గమన్నారు. ఈ విషయంలో ఫ్యాక్టరీ అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తున్నదని విమర్శించారు. కూలీల కష్టాన్ని దోచుకున్న ట్రాన్స్‌పోర్టు ఆపరేటర్ నుంచి డబ్బులు వసూలు చేసి తిరిగి చెల్లించే బాధ్యతను గోవాడ యాజమాన్యం తీసుకోవాలని వారు సూచించారు. కూలీలకు న్యాయం జరగని పక్షంలో ఆందోళనకు దిగుతామని వారు హెచ్చరించారు.

గ్రామాల్లో చురుగ్గా అభివృద్ధి పనులు

రోలుగుంట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జె.నాయుడుపాలెం, జగ్గంపేట, పడాలపాలెం గ్రామాల్లో పలు అభివృద్ధి పనులు చురుగ్గా చేపడుతున్నట్టు ఎంపీటీసీ సభ్యుడు బోడాపాత్రుని జగది తెలిపారు. మంగళవారం జె.నాయుడుపాలెంలోని ఎస్సీ కాలనీ శ్మశానవాటికలో బోర్‌వెల్, జగ్గంపేటలో రెండు బోర్‌వెల్, పడాలపాంలో ఒక బోర్‌వెల్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. జగ్గంపేట పంచాయతీలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే రాజు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బోడాపాత్రుని నరేశ్, కిల్లాడ సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సాగుదారులకు హక్కులు కల్పించాలి

చీడికాడ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనాం, శిరిజాం, వీరభద్రునిపేట పంచాయతీల్లో రీ సర్వే వెంటనే ప్రారంభించి సాగులో ఉన్న వారందరికీ హక్కులు కల్పించాలని సీపీఎం జిల్లా, మండల నాయకులు గంటా శ్రీరామ్, రొంగలి దేముడునాయుడులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయం ఎదుట గిరిజనులతో కలిసి మంగళవారం ధర్నా చేశారు. అనంతరం ఆర్ఐ రామారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హత ఉన్నవారందరికీ పట్టాలు ఇవ్వాలని రెవెన్యూ సదస్సులో వచ్చిన ఫిర్యాదులకు పరిష్కారం చూపాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కె.కన్నబాబు, గంగరాజు, నాగరాజు, సన్నిబాబు పాల్గొన్నారు.

ఉపాధి పనులకు బిల్లులు ఇప్పించరూ..

బుచ్చెయ్యపేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఉపాధి పథకంలో చేసిన పనులకు బిల్లులు చెల్లించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఎంపీడీవో విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఎనిమిది వారాలుగా పని చేయడం తప్ప బిల్లులు రాకపోవడంతో కూలీలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే పెండింగ్‌లో ఉన్న బకాయిలు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. పని ప్రదేశంలో ఉపాధి కూలీలకు ఎటువంటి ప్రమాదాలు జరిగినా, గాయాలైనా మెడికల్ ఖర్చులు ప్రభుత్వమే భరించాలని, ఉపాధి కూలీలకు రోజుకి రూ.600 గిట్టుబాటు కూలి ఇవ్వాలని, ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కన్వీనర్ ఎస్‌వి.నాయుడు, నాయకులు సాంబశివరావు, ఈశ్వరరావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో శారీరక ఎదుగుదల

దేవరాపల్లి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు పోషకాహారం ఎంతో అవసరమని సీడీపీవో వి.మంగతాయారు స్పష్టం చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు మంగవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఐదేళ్ల లోపు పిల్లలకు పోషకాహారం తప్పనిసరిగా అందాలని చెప్పారు. వయసుకు తగ్గ బరువు, శారీరక, మానసిక ఎదుగుదల తదితర వివరాలను రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాములమ్మ, ఆదిలక్ష్మి, సుశీల, శ్రీలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీవో మంగతాయారు

గున్నెంపూడిలో వైభవంగా గంగాదేవి పండుగ


అమ్మవారిని దర్శించుకుంటున్న బత్తుల తాతయ్యబాబు, నాయకులు

బుచ్చెయ్యపేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గున్నెంపూడి గ్రామంలో మంగళవారం గంగాదేవి అమ్మవారి పండుగను వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. నిర్వాహకులు భారీ అన్నసమారాధ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. అమ్మవారిని స్టేట్ హౌసింగ్ బోర్డు చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, జనసేన పార్టీ చోడవరం ఇన్‌చార్జి పీవీఎస్ఎన్.రాజు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, నాయకులు గోకివాడ కోటేశ్వరరావు, దేవర అప్పారావు, తమరాన దాసు, డొంకిన అప్పలనాయుడు, ఎంవీ.సత్యనారాయణ, వెలంకాయల అప్పలనాయుడు, కోట సత్యనారాయణ, వియ్యపు అప్పారావు, కార్యకర్తలు దర్శించుకున్నారు.

గొంప మిరియాల చెరువు ఆక్రమణపై సర్వే


గొంప మిరియాల చెరువును సర్వే చేస్తున్న అధికారులు

రావికమతం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): గొంప మిరియాల చెరువు ఆక్రమణలను మంగళవారం రెవెన్యూ అధికారులు సర్వే చేశారు. సర్వే నంబరు 114లో 38 ఎకరాల చెరువు గర్భం గల మిరియాల చెరువులో సుమారు ఐదెకరాలు ఆక్రమణకు గురైనట్టు రైతులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రెండు పర్యాయాలు సర్వే చేసి ఆక్రమణలు గుర్తించి హద్దులు నిర్ధారించారు. ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చి తొలగిపోవాలని ఆదేశాలు జారీ చేశారు. అలాగే రూ.5 లక్షల ఉపాధి నిధులు మంజూరు చేసి పూడికతీత పనులు చేయించాలని ఆదేశించారు. రెవెన్యూ అధికారులు నిర్ధారించిన హద్దులు చెరిగిపోవడంతో రైతుల అభ్యర్థన మేరకు మంగళవారం మరోసారి సర్వే చేసి హద్దులను నిర్దేశించారు.

ఖండివరంలో ఎల్‌పీసీలు ఇవ్వొద్దని వినతి


ఆర్ఐకు సమస్య తెలుపుతున్న గ్రామస్థులు

చీడికాడ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): గతంలో నిర్మాణాలు పూర్తి చేసిన పక్కా గృహాలకు ఎల్‌పీసీలు ఇవ్వవద్దని ఖండివరం గ్రామానికి చెందిన కొటాన వరహాలుబాబు, కొటాన సన్యాసమ్మ, కొటాన వరలక్ష్మి అధికారులను కోరారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ రామారావుకు మంగళవారం వినతిపత్రం అందించి సమస్యను వివరించారు. పోతల ముత్యాలమ్మ, పోతల రమణమ్మ ఆరేళ్ల క్రితం పక్కా గృహాల నిర్మించారని, వాటికి ఆనుకొని స్థల సమస్య కోర్టులో ఉందని తెలిపారు. తహసీల్దార్‌కు తెలుపుతామని ఆర్ఐ చెప్పారు.

కొండగెడ్డ అక్రమణదారుడిపై కేసుకు సిఫారసు


ఆక్రమణలను పరిశీలిస్తున్న రెవెన్యూ సిబ్బంది

మాకవరపాలెం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): తామరం రెవెన్యూలో కొండగెడ్డను ఆక్రమించిన వ్యక్తిపై కేసు నమోదు చేయాలని పోలీసులకు సిఫారసు చేసినట్టు తహసీల్దార్ ఎల్.రామారావు చెప్పారు. 61/3 సర్వే నంబరులో ఉన్న గెడ్డపోరంబోకు భూమిని తామరం గ్రామానికి చెందిన వ్యక్తి చదను చేసి మట్టితో కప్పివేశారన్నారు. మంగళవారం రెవెన్యూ సిబ్బంది ఆక్రమణ భూమిని పరిశీలించారన్నారు. అయితే పక్కన ఉన్న జిరాయితీ భూమిలో మట్టిని తీసి గెడ్డపోరంబోకు భూమితో పాటు కొండగెడ్డను కూడా మట్టితో కప్పివేయడంతో అతనిపై కేసు నమోదు చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేశామని తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ జట్టి, వీఆర్‌వోలు సాంబ, కుమారి పాల్గొన్నారు.

పన్ను బకాయిలు ఒకేసారి చెల్లిస్తే వడ్డీపై 50 శాతం రాయితీ

నర్సీపట్నం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలో పేరుకుపోయిన ఆస్తి పన్ను బకాయిలు ఈ నెలాఖరులోపు ఒకేసారి చెల్లిస్తే వడ్డీపై 50 శాతం రాయితీ కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని కమిషనర్ సురేంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఇంటి పన్నులు, ఖాళీ జాగా పన్నుల బకాయిలు ఈ నెల 31లోగా ఒకేసారి చెల్లించి ప్రభుత్వం కల్పించిన వడ్డీ రాయితీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో పన్ను బకాయిలు వడ్డీతో చెల్లించిన పన్ను చెల్లింపుదారులకు కూడా వడ్డీ రాయితీ లభిస్తుందని తెలిపారు. ఈ వడ్డీ రాయితీ నగదును వచ్చే సంవత్సరంలో ఇంటి పన్నులో సర్దుబాటు చేస్తామని తెలిపారు. పన్ను చెల్లింపుదారులు కోసం మునిసిపల్ కార్యాలయంలో ఉదయం 8 నుంచి రాత్రి 10 గంటల వరకు ప్రత్యేక క్యాష్ కౌంటర్లు ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు.

'ఉన్నత విద్యావంతులను తీర్చిదిద్దిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల'

నర్సీపట్నం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్థాపించి 40 సంవత్సరాలు పూర్తి చేసుకొని ఎంతో మంది విద్యార్థులను ఉన్నత విద్యావంతులు, ఉద్యోగులుగా తీర్చిదిద్దిందని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు అన్నారు. కళాశాలలో మంగళవారం వీడ్కోలు సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాలుగు దశాబ్దాలు పూర్తి చేసుకున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల విశేషాలు తెలియజేసే వార్షిక మేగజైన్‌ని ఆవిష్కరించారు. కళాశాలలోని సదుపాయాలు, అందుబాటులో ఉన్న కోర్సులు వివరాలు తెలియజేశారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రంలో వైస్ ప్రిన్సిపాల్ కృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్‌టీఏ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సంతోశ్‌కుమార్

కృష్ణాదేవిపేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం అనకాపల్లి జిల్లా వర్కింగ్ ప్రెసిండెంట్‌గా లింగంపేట సర్పంచ్ తేకల సంతోశ్‌కుమార్‌ను నియమించారు. ఈ మేరకు సోమవారం విశాఖపట్నంలో జరిగిన రాష్ట్ర స్థాయి ఆర్‌టీఏ సమావేశంలో లింగంపేట గ్రామ సర్పంచ్‌కు సమాచార హక్కు చట్టం జాతీయ అధ్యక్షుడు రంగసాయిరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు జక్కు నరసింహమూర్తి చేతుమీదుగా నియమామిక పత్రాన్ని అందించారు. ఈ మేరకు పలువురు నాయకులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. దీనికి తగిన న్యాయం చేస్తానని సర్పంచ్ సంతోశ్‌కుమార్ తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలి

నాతవరం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యతతో కూడిన భోజనం వడ్డించాలని ఉచిత సరాఫరాల బృందం సభ్యులు సీకే దువరాయులు కోరారు. మంగళవారం ఈ బృందం సభ్యులు మర్రిపాలెం కస్తూర్బాగాంధీ పాఠశాలలో బాలికలకు వడ్డిస్తున్న మధ్యాహ్నం భోజనం నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే శానిటరీ నాప్‌కిన్స్, రికార్డుల శాంపిళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 కామిరెడ్డి వరహాలబాబు, మధ్యాహ్న భోజనం కోఆర్డినేటర్ అచ్యుతరావు, తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక జాతర రేపు

రోలుగుంట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొవ్వూరు, బుచ్చెంపేట గ్రామాల్లో ఈ నెల 27వ తేదీన నూకాంబిక జాతర మహోత్సవం నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఆయా గ్రామాల్లో మూడు రోజుల నుంచి గరగల ఊరేగింపుతో ప్రారంభమైన జాతర 27న రాత్రి జాతరతో ముగిస్తుందన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో డ్యాన్స్ బేబీ డ్యాన్స్‌తో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తామని చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జాతరను విజయవంతం చేయాలని కోరారు.

28న పంచాయతీ దుకాణాల వేలం

మాడుగుల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మాడుగుల పంచాయతీ పరిధిలో ఉన్న 30 దుకాణాలకు ఈ నెల 28న వేలం పాట నిర్వహిస్తామని పంచాయతీ కార్యదర్శి మూర్తిబాబు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ఈ వేలం పాట ఉంటుందన్నారు. దీనికి సంబంధించి వెయ్యి రూపాయలు డిపాజిట్ చేయాలని, దుకాణాలు పాడుకున్న వ్యక్తులు పాట రోజునే తొమ్మిది నెలల అద్దెను చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

ఘనంగా వీరాంజనేయస్వామి తీర్థం

మాడుగుల రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.కోటపాడు గ్రామంలో మంగళవారం వీరాంజనేయస్వామి తీర్థమహోత్సవం ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపించి తీర్థ ప్రసాదాలు అందించారు. సాయంత్రం నిర్వహించిన ఎడ్ల పరుగు పోటీలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

తాగునీటి ఎద్దడి నివారణకు బోర్లు మంజూరు

చీడికాడ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు మంచినీటి బోర్లు మంజూరు చేయించామని ఎంపీపీ కురచా జయమ్మ తెలిపారు. మండలంలోని మంచాల గ్రామంలో కూనిరెడ్డి దేముడు కళ్లాల వద్ద మంగళవారం బోరు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జడ్పీటీసీ గ్రాంటు నుంచి 16 బోర్లు, మండల పరిషత్ నిధుల నుంచి ఎనిమిది బోర్లు మంజూరు చేయించామన్నారు. తాగునీటికి ఇబ్బందులు లేకుండా మరిన్ని బోర్లు మంజూరుకు కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షుడు గొల్లవిల్లి రాజబాబు, నాయకులు కురచా నారాయణమూర్తి, కసిరెడ్డి రామకృష్ణ పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేటలో...

బుచ్చెయ్యపేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఐతంపూడి గ్రామంలో నాలుగు బోర్లు మంజూరు చేశారు. విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, ఎంపీపీ డి.నాగేశ్వరిదేవి మంగళవారం రిగ్గును ప్రారంభించారు. అలాగే వడ్డాది పల్లెవీధిలో మోదకొండమ్మ ఆలయం వద్ద వైస్ ఎంపీపీ డి.లలితా నారాయణమూర్తి బోరు నిర్మాణానికి రిగ్గు ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు జి.కోటేశ్వరరావు, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు దేవర అప్పారావు, డీసీసీబీ డైరెక్టర్ కోవెల జనార్ధనరావు, నాయకులు కె.సత్యనారాయణ, ఎ.శ్రీను, అప్పన్నపైడినాయుడు, ఎ.శ్రీను పాల్గొన్నారు.

ఒడిశా సరిహద్దు వరకు ఆర్టీసీ బస్సు సర్వీసు నడపాలని వినతి



ఎస్పీ అమిత్‌బర్దారుకు వినతి పత్రాన్ని ఇస్తున్న జామిగూడ పంచాయతీ నాయకులు

పెదబయలు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ముంచంగిపుట్టు మండలం కుమడ పంచాయితీ కేంద్రం వరకు నడుస్తున్న ఆర్టీసీ బస్సు సర్వీసును జామిగూడ మీదుగా ఒడిశా సరిహద్దు వరకు పొడిగించేలా చూడాలని జామిగూడ పంచాయతీ నాయకులు తెరవాడ వెంకటరావు, మఠం సుందర్‌రావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో ఎస్పీ అమిత్‌బర్దార్‌ను కలసి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముంచంగిపుట్టు మండలం బూసిపుట్టు, పెదబయలు మండలం జామిగూడ పంచాయితీలకు చెందిన గ్రామాల ప్రజలకు రవాణా సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రైవేటు వాహనాలలో ప్రయాణించాల్సి వస్తోందని వాపోయారు. రహదారి సౌకర్యం ఉన్నందున జిల్లా పోలీసు శాఖ చొరవతో పాడేరు నుంచి వయా ముంచంగిపుట్టు మీదు గా కుమడ వరకు నడుపుతున్న బస్సు సర్వీసును జామిగూడనుంచి ఒడిశా సరిహద్దు వరకు పొడిగించాలని కోరారు. అలాగే, తారాబు - పెద్దగడ్డ వంతెన నిర్మాణం పూర్తికి నిధులు మంజూరు చేసేలా ప్రభుత్వానికి తెలియజేయాలని అన్నారు. ఎస్పీ సానుకూలంగా స్పందించి త్వరలోనే బస్సు సర్వీసును బస్సు సర్వీసు పొడిగింపునకు చర్యలు తీసుకుంటామని అన్నారని తెలిపారు.

జీడి మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు సూరిబాబు

కొయ్యూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మన్యంలో కాఫీ రైతులకు ఇస్తున్న ప్రోత్సాహకాలు జీడి మామిడి రైతులకు వర్తించడంతోపాటు ఐటీడీఏ ద్వారా పంటను కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని స్థానిక పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు సుమర్ల సూరిబాబు డిమాండ్ చేశారు. మండల వ్యాప్తంగా 33 పంచాయతీల్లో సుమారు 4 వేల హెక్టార్లకు పైగా ఈ పంటను గిరిజన రైతులు సాగు చేస్తున్నారన్నారు. ఈ ప్రాంతీయుల జీవనాధారమైన జీడిమామిడి ఫలాలను కొనుగోలు చేసే విషయంలో ఐటీడీఏ నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. కాఫీ పంటను కొనుగోలు చేసినట్లే ఐటీడీఏ జీడిమామిడి పిక్కలు కొనుగోలు చేపట్టేలా ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. మద్దతు ధర లభించేలా కొనుగోలు చేయాలని కోరారు. కలెక్టర్ దినేశ్‌కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్ గౌడ్ స్పందించి గిరిజన, గిరిజనేతరులు పండించే జీడిమామిడి కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని సూరిబాబు విజ్ఞప్తి చేశారు.

అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

చింతపల్లి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో నూతనంగా మంజూరైన పీఎం జన్‌మన్ రెగ్యులర్ అంగన్‌వాడీ హెల్పర్ ఖాళీల భర్తీకి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు స్థానిక ఐసీడీఎస్ సీడీపీవో జీవీ రమణ తెలిపారు. మంగళవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండలంలో ఆరు ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన స్థానిక గిరిజన మహిళలు అర్హులన్నారు. వయస్సు 21-35 మధ్య ఉండాలన్నారు. ఈనెల 26తేదీ నుంచి ఏప్రిల్ 4వ తేదీలోగా స్థానిక ప్రాజెక్టు కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలన్నారు.

జి. మాడుగులలో..

జి.మాడుగుల: అంగన్‌వాడీల ఉద్యోగాలకు ఈ నెల 26 నుంచి ఏప్రిల్ 10వరకు దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీవో సువర్ణమ్మ తెలిపారు. మండలంలోని వంజరి పంచాయతీ వెన్నెలకోట అంగన్‌వాడీ కేంద్రం, తాడిపాలెం, సింగర్భ పంచాయతీ రచ్చపల్లిలో ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. వంజరి పంచాయతీలో గొప్పులపాలెం అంగన్‌వాడీలో (మెయిన్ టీచర్), బొయితిలి పంచాయతీ చీడిమెట్ట (మినీ టీచర్), జి.మాడుగుల పంచాయతీ వైబీ గొందురులో మినీ టీచర్, పెదలోచలి పంచాయతీ సవరగెడ్డలో మినీ టీచర్ ఉద్యోగాలకు 10వ తరగతి ఉత్తీర్ణతతో గ్రామంలోని వివాహితగా ఉండి, 18 నుంచి 35 ఏళ్ల వయస్సు కలిగి అర్హులై ఉండాలని చెప్పారు.

శతాధిక వృద్ధురాలు మృతి



కొర్ర బంగారమ్మ (ఫైల్)

పెదబయలు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలం కిముడుపల్లి పంచాయితీ సావిడిమామిడి గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు కొర్ర బంగారమ్మ అలియాస్ సుక్రి (104) మృతి చెందారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె చికిత్స పొందుతూ సోమవారం గ్రామంలోని స్వగృహంలో మృతి చెందారు. దీంతో మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఉన్న మృతురాలి కుటుంబ సభ్యులు భారీగా సావిడిమామిడికి చేరుకుని నివాళులర్పించారు. అంత్యక్రియల్లో పాల్గొన్నారు. బంగారమ్మ తన 104 ఏట కూడా ఎవరిపైనా ఆధారపడకుండా తన పనులు తానే చేసుకునేవారని స్థానికులు చెబుతున్నారు. చివరి నిమిషంలోనూ ఇదే ఒరవడి చూపినట్టు తెలిపారు.

గెమ్మెలి ఉప సర్పంచి ఎన్నిక రేపు

జి.మాడుగుల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గెమ్మెలి పంచాయతీ ఉప సర్పంచి ఎన్నికను ఈ నెల 27న నిర్వహిస్తున్నట్లు స్థానిక ఎంపీడీవో ఎస్ డేవిడ్‌రాజు తెలిపారు. ఆగ్రామ సచివాలయంలో నిర్వహించనున్న ఈ ఎన్నికకు వార్డు సభ్యులంతా హాజరుకావాలని ఆయన కోరారు.

రేపటి నుంచి నూకాంబిక ఉత్సవాలు

» కక్కి మలకపాలం గ్రామాల్లో భారీ ఏర్పాట్లు



మలకపాలంలో ఉత్సవాలకు ముస్తాబవుతున్న నూకాంబిక ఆలయం

పాడేరురూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కొత్త అ మావాస్య నూకాంబిక ఉత్సవాలకు సలుగు పంచాయతీ కక్కి గ్రామం, వంట్లమామిడి పంచాయతీ మలకపాలం గ్రామాల్లో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ గ్రామల్లో ఈ నెల 27వ తేదీ నుంచి 29వ తేదీ వరకు మూడు రోజులపాటు ఈ ఉత్సవాలు నిర్వహించనున్నారు.

వాలీబాల్ పోటీలు



కక్కి గ్రామంలో నూకాంబిక అమ్మవారు

కక్కి గ్రామంలో ఈ ఉత్సవాలు నేపథ్యంలో రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్టు స్థానిక ఎంపీటీసీ సభ్యుడు దూసూరి గంగరాజు, సోమెలి బాబూరావు తెలిపారు. విజేతలకు రూ. 20 వేలు, 15 వేలు, 10 వేలు వరుసగా నగదు బహుమతులు అందించనున్నామన్నారు. ఈ పోటీల్లో పా ల్గొనే జట్లు రూ. 300 ప్రవేశ రుసుం చెల్లించాలన్నారు. వివరాలకు ఫోన్: 93908 89855 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు సోమెలి ఈశ్వరరావు, సీదరి శ్రీనివాసరావు, జంగెడి ఈశ్వరరావు, సీదరి బాలకృష్ణ, చప్పి రామరాజు పాల్గొన్నారు. మలకపాలం గ్రామంలో ఈ నెల 27న మండల స్థాయి వాలీబాల్, ముగ్గులు, డ్యాన్స్ పోటీలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు సీహెచ్.అప్పారావునాయుడు, కె.త్రినాథ్, సీహెచ్.సింహాచలం, సీహెచ్. భైరవమూర్తి తెలిపారు. వాలీబాల్ పోటీల్లో విజేతలకు ప్రథమ బహుమతిగా రూ. 10 వేలు, ద్వితీయ బహుమతి రూ. 8 వేలు, తృతీయ బహుమతి రూ. 5 వేలు అందిస్తామన్నారు. పోటీల్లో ప్రవేశ రుసుం రూ. 200 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు ఫోన్: 949437 7164 సంప్రదించాలన్నారు.

క్రీడల్లో యువత రాణించాలి: ఎస్ఐ



క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతున్న స్థానిక ఎస్ఐ శ్రీనివాసరావు

అనంతగిరి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): గిరిజన యువత క్రీడల్లో రాణించాలని స్థానిక ఎస్ఐ డీ.శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్ర పరిధి పెద్దూరులో స్థానికులు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన క్రికెట్ టోర్నీమెంట్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత వ్యసనాలకు దూరంగా ఉంటూ.. క్రీడలపై మక్కువ పెంచుకోవాలన్నారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాలతో అనారోగ్యానికి గురికావడంతో పాటుగా కుటుంబాలు రోడ్డున పడతాయని హెచ్చరించారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు సాధించాలన్నారు. ఇష్టపడి చదివితే ఉన్నతస్థానాల్లో స్థిరపడేందుకు వీలువుతుందని పిలుపునిచ్చారు. అనంతరం ఇరు జట్ల క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలోని జేఏసీ నాయకులు రవీంద్ర, రామకృష్ణ, టీడీపీ నాయకుడు సుబ్బారావు, రంజిత్, పాల్గొన్నారు.

జాతరలు గిరిజన సంప్రదాయ ప్రతిబింబాలు

» ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు



అమ్మవారి దర్శించుకుంటున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

చింతపల్లి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంప్రదాయాలు, సంస్కృతిని పరిరక్షించుకోవాలని పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు. మంగళవారం అంజలి గ్రామ పంచాయతీలో జరుగుతున్న బోడకొండమ్మ గంగాలమ్మ, ఎర్ర కొండమ్మ జాతరను పురస్కరించుని ఆయన అమ్మవారులను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామదేవతలకు జాతరలు నిర్వహించడం గిరిజన ప్రాంతంలో ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ జాతరలు గిరిజనుల సంస్కృతి, సాంప్రదాయాలు ప్రతిబింబిస్తాయన్నారు. ఆదివాసీ సంస్కృతిని భావితరాలకు పరిచయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సాగిన వెంగళరావు, సర్పంచ్ పేట్ల రాజుబాబు, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు లోచలి భవాని, గ్రామపెద్దలు కిముడు లక్ష్మణరావు, చిన్నలక్ష్మణరావు, సాగిన సింహాచలం, గణపతిరావు, కల్యాణం, అశోక్ కుమార్, రామకృష్ణ పాల్గొన్నారు.

సచివాలయాల్లో రోజూ సేవలందించాలి



డిజిటల్ అసిస్టెంట్లకు పలు సూచనలు చేస్తున్న ఎంపీడీవో

అనంతగిరి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): సచివాలయాల పరిధిలోని రోజుకు కనీసం పది సర్వీసులు (సేవలను) ప్రజలకు అందించాలని ఎంపీడీవో ఏవీవీ.కుమార్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండ పరిధిలోని 21 సచివాలయాల్లోని డిజిటల్ అసిస్టెంట్‌లతో ఎంపీడీవో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని కోరారు. ఉన్నతాధికారులు తనిఖీలు దృష్టిలో పెట్టుకుని, రికార్డులను స క్రమంగా నిర్వహించాలని సూచించారు. సచివాలయం ద్వారా అందించే సేవలకు సంబంధించి బ్యానర్లను ఏర్పాటుచేయాలని ఆదేశించారు.

గుంటగన్నేలలో నేత్ర వైద్య శిబిరం



నేత్ర వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య నిపుణులు

డుంబ్రిగుడ,మార్చి25(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంటగన్నేల పంచాయతీ కేంద్రంలో విశాఖ ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి సహకారంతో మానవ హక్కుల నేర నిరోధక సంఘం మహిళా అధ్యక్షురాలు కృష్ణకుమారి ఆధ్వర్యాన మంగళవారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 90మందికి ఆసుపత్రి నిపుణులు వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 15మందికి శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసి విశాఖపట్నం ఆస్పత్రికి తీసుకేళ్లేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో క్యాంపు కో-ఆర్డీనేటర్ స్వాములు, సిబ్బంది, స్థానిక హెల్త్‌అసిస్టెంట్ రవింద్ర తదితరులు గిరిజనులు పాల్గొన్నారు.

సంప్రదాయ విత్తనాల నమోదుతో ఎన్నో ప్రయోజనాలు

హైదరాబాద్ ఐసీఏఆర్ ప్రధానశాస్త్రవేత్త డాక్టర్ ఏఆర్ రెడ్డి



రైతుల హక్కుల పరిరక్షణ చట్టం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రధాన శాస్త్రవేత్త ఏఆర్‌రెడ్డి, ఏడీఆర్ అప్పలస్వామి, శాస్త్రవేత్తలు

చింతపల్లి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక లక్షణాలు కలిగిన సంప్రదాయ విత్తనాలను రైతుల హక్కుల అథారిటీలో నమోదు చేసుకోవాలని హైదరాబాద్ వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) అటారి భారతీయప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఏఆర్ రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శైలజ కుర్రా అధ్యక్షతన మొక్కల రకాల పరిరక్షణ, రైతుల హక్కుల చట్టం- 2001పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఐసీఏఆర్ ప్రధాన శాస్త్రవేత్త మాట్లాడుతూ వివిధ రకాల విత్తనాలు, పంటల వైవిధ్యం ఉన్నప్పటికీ తెలుగు రాష్ట్రాల నుంచి నమోదు చేసుకున్న రకాలు చాలా తక్కువగా ఉన్నాయన్నారు. రైతుల హక్కుల అథారిటీలో నమోదు చేసుకునేందుకు ప్రస్తుతం అందుబాటులోనున్న రకాలకంటే భిన్నంగా ఉండాలన్నారు. మొక్కలు, విత్తనాల్లో ఎదుగుదల, రంగు, రుచి, పోషక విలువల్లో ఏదో ఒక అంశంలో ప్రత్యేకత ఉండాలన్నారు. ఈవిధంగా నమోదు చేసుకున్న రకాలపై రైతులకు హక్కు ఉంటుంటుందని, ఈ మొక్కలపై పరిశోధనలు నిర్వహించాల్సివస్తే నమోదు చేసుకున్న రైతుల అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ ఆళ్లఅప్పలస్వామి మాట్లాడుతూ రైతుల హక్కుల అథారిటీలో నమోదు చేసుకున్న రకాలపై పేటెంట్ చట్టం కన్నా రైతులకు అధిక ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఎలాంటి రుసుము చెల్లించకుండగా సొసైటీలు, రైతు క్లబ్‌లు, గ్రామాల పేరుతో రకాలను నమోదు చేసుకోవచ్చునన్నారు. సంజీవని స్వచ్ఛంద సంస్థ సంచాలకులు దేముళ్ల మాట్లాడుతూ విత్తన రకాలను నమోదు వల్ల 14 ఏళ్ల క్రితమే 10లక్షల రివార్డును అందుకున్నామని తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శైలజ కుర్రా మాట్లాడు రైతుల హక్కుల పరిరక్షణ చట్టంపై ప్రతి రైతులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం రైతుల హక్కుల పరిరక్షణ చట్టంపై ముద్రించిన పుస్తకాలను శాస్త్రవేత్తలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త బండి నాగేంద్ర ప్రసాద్, డాక్టర వాన ప్రసాదరావు, ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్త డాక్టర్ బయ్యపురెడ్డి, డాక్టర్ బాలహంస్సేన్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ధ్రువ పత్రాలపై ప్రజల్లో అవగాహన

» అధికారులకు జిల్లా రెవెన్యూ అధికారి కె.పద్మలత ఆదేశం



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌వో కె.పద్మలత

పాడేరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మంజూరుచేసే ధ్రువపత్రాలపై ప్రజలకు మరింత అవగాహన పెంచాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.పద్మలత ఆదేశించారు. ఐటీడీఏ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ధ్రువపత్రాలపై మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఏజెన్సీలో అధిక శాతం గిరిజనులు నిరక్షరాస్యులు కావడంతో వారికి ధ్రువపత్రాలపై సరైన అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి ధ్రువపత్రం పొందాలంటే ఎవరిని సంప్రదించాలని, ఎలా కేటాయిస్తారన్న విషయాలపై గిరిజనులకు సంపూర్ణ అవగాహన కల్పించేందుకు క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది అవగాహన సదస్సు, సమావేశాలు నిర్వహించాలన్నారు. అలాగే ధ్రువపత్రాలను గ్రామ సచివాలయాలు లేదా మీ సేవా కేంద్రాల్లో పొందాలనే విషయాలను ప్రజలకు తెలిపాలన్నారు. కుల, ఆదాయ, జనన, మరణ ధ్రువపత్రాల జారీలో నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని సూచించారు. ధ్రువపత్రాల జారీపై గ్రామ రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌కు అవసరమైన మార్గదర్శకాలు జారీ చేయాలని జిల్లా పంచాయతీ అధికారి, డివిజనల్ పంచాయతీ అధికారికి డీఆర్‌వో పద్మలత సూచించారు. భూముల మ్యూటేషన్ ప్రక్రియను సైతం పక్కాగా పరిశీలించి సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి బి.లవరాజు, సచివాలయాల జిల్లా నోడల్ అధికారి పీఎస్.కుమార్, జిల్లా సబ్ రిజిస్ట్రార్ కె.రమేశ్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ నాగరాజు, ఏజెన్సీ 11 మండలాలకు చెందిన తాహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

ఆదివాసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా కమిటీ ఏకగ్రీవం

» అధ్యక్ష కార్యదర్శులుగా సోంబాబు, శ్రీనివాసరావు ఎన్నిక



సంఘీభావం తెలుపుతున్న సంఘం నేతలు

పాడేరురూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆల్ ఇండియా ఆదివాసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసపడాల్, రాష్ట్ర ఆర్గనైజర్ సోమెలి సింహాచలం ఆధ్వర్యంలో జరిగిన ఈఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడిగా జి.సోంబాబు, ప్రధానకార్యదర్శిగా కె.శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షుడిగా కె.గంగన్నపడాల్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా జి.జనార్ధనరావు మజ్జి ఎంపికయ్యారు. కోశాధికారిగా ఎల్.ఈశ్వరమ్మ, సహాయ కోశాధికారిగా పి.సింహాచలం, ఉపాధ్యక్షులుగా ఎల్‌వీఎన్ పాత్రుడు, కాకర రాజు, కారం లక్ష్మి, కె.కృష్ణారెడ్డి, కార్యదర్శులుగా వంతాల సురేశ్, పి.శ్రీనివాసరావు, టి.కోటి, పి.సురేశ్, సహాయకార్యర్శులుగా టి.ముదిరాజు, కె.కృష్ణవేణి, కె.నారాయణరావు, వినోద్‌కుమార్, కె. వెంకటరమణ, జిల్లా ఆర్గనైజర్లుగా ఎస్.శేషారావు, ఎ.సత్యానందం, మహిళా అధ్యక్షురాలుగా డి.కనకదుర్గ, ప్రధానకార్యదర్శిగా యు.కొండమ్మ, కార్యదర్శిగా జె.కృష్ణవేణి, మరో తొమ్మిది మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఉద్యోగులుఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతనంగా కమిటీ ఈసందర్భంగా పేర్కొంది.

ఆధార్ అప్‌డేట్‌కు అవస్థలు.. రేషన్‌దారుల ఆందోళన



ముంచంగిపుట్టు సచివాలయం ఆవరణలో ఆందోళన చేస్తున్న రేషన్‌దారులు

ముంచంగిపుట్టు, మార్చి 25(అంధ్రజ్యోతి): ఈకేవైసీ నమోదు కిట్లు లేక, సర్వర్‌లో సాంకేతిక సమస్యలతో ఆధార్ నవీకరణ ప్రక్రియ సక్రమంగా జరగకపోవడంతో రేషన్ కార్డుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఆప్‌డేట్ గడువు పెంచాలని డిమాండ్ చేస్తూ గిరిజన సంఘం ఆధ్వర్యంలో లబ్ధిదారులు మంగళవారం మండల కేంద్రంలో కించాయిపుట్టు సచివాలయం పరిధిలో లబ్ధిదారులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజనసంఘం మండల నాయకుడు ఎం.ఎం.శ్రీను మాట్లాడుతూ ఈకేవైసీ, ఆధార్ అప్‌డేట్ సక్రమంగా జరగకపోవడంతో సుదూర ప్రాంతాల నుంచి పిల్లాపాలతో వచ్చి అవస్థలకు లోనవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కార్యాలయం ఎదుట పడిగాపులు కాస్తున్నార న్నారు. రెండు, మూడు రోజులపాటు తిరిగితే గానీ అప్‌డేట్ కావడంలేదని విచారం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఈకేవైసీ గడువు పెంచాలని, లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా అధికారులు చూడాలని ఆయన డిమాండ్ చేశారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

విశాఖపట్నం మార్చి 25 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి గురై ఓ మహిళ మృతి చెం దింది. ఈ సంఘటన హనుమంతవాక కూడలిలో మంగళవారం జరిగింది. అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి ప్రాంతానికి చెందిన గణపతి రంభ (59) కొంతకాలంగా స్థానిక మేస్త్రి వద్ద పనిచేస్తోంది. ఇందులో భాగంగా మంగళవారం గోడలకు వాటరింగ్ చేస్తుండగా విద్యుత్ మోటారుకు ఆనుకుని ఉన్న పైపును పట్టుకోవడంతో విద్యుదాఘాతానికి గురయింది. దీంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయింది. సంబంధిత కాంట్రాక్టర్ వెంటనే ఆమెను ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, వైద్యులు పరీక్షించి విమ్స్ తరలించాలని సూచించారు. అక్కడికి చేర్చేసరికి రంభ మృతిచెందింది. కాగా ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ కృష్ణ తెలిపారు.

సమస్యలపై ధర్నా



పాడేరు ఎంపీడీవో కార్యాలయం ముందు సీపీఎంనేతల ధర్నా

పాడేరురూరల్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నేతలు మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈనెల 8 నుంచి చేపట్టిన ప్రజా చైతన్యయాత్ర మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తంచేశారు. పలు సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స జిల్లా కమిటీ సభ్యుడు పాలికి లక్కు, మండల కార్యదర్శి ఎల్.సుందరరావు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రెండేళ్లుగా ఫింఛన్‌కోసం ఎదురుచూపు



వితంతువు అంజిలమ్మ

జి.మాడుగుల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగర్భ పంచాయతీ ఎం. నిట్టాపుట్టు గ్రామానికి చెందిన జర్రా అంజిలమ్మ రెండేళ్లుగా వితంతువు పింఛన్‌కోసం ఎదురు చూస్తున్నా ఫలితం లేకపోవడంతో ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈసందర్భంగా ఆమె విలేకరుల ఎదుట తన గోడు వెల్లదీసుకున్నారు. తన భర్త జర్రా కొండబాబు మృతి చెంది రెండేళ్ల అయింది. కుమారులు, కుటంబీకులేవరూ లేక జీవనానికి కష్టంగా మారినట్టు తెలిపారు. దీంతో ఇరుగుపొరుగు వారి సహాయంతో వితంతువు పింఛన్‌కు దరఖాస్తులు చేసుకున్నా అధికారులెవరూ కనికరించలేదని వాపోయారు.

అవసరమైన ధ్రువ ప్రతాలన్నీ సమర్పించినా పింఛన్ మంజూరుకలేదని, అధికారులు ఇకనైనా స్పందించి తనకు పింఛన్ మంజూ రు చేసి ఆదుకోవాలని ఆమె వేడుకున్నారు.

సిమాలపాడులో సమస్యలపై వినతి



అధికారికి వినతి ప త్రమిస్తున్న సీపీఎం నాయకులు

జి.మాడుగుల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గెమ్మెలి పంచాయతీ సీమలపాడు, చిన్నకొత్తూరు, గడ్రాయి గ్రొడుగురాయి గామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని సీపీఎం నాయకులు ధర్మనపడాల్ కోరారు. ప్రజా చైతన్య యాత్ర భాగంగా మంగళవారం గ్రామాల్లో పర్యటించారు. తాగునీరు, డ్రైనేజీ, రహదారి, పింఛన్, రేషన్ కార్డులు వంటి సమస్యలను గుర్తించారు. ఈ మేరకు మండల కేంద్రంలో నిరసన చేపట్టారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో చేరుకోని జూనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సన్యాసిదొర, ధర్మరావు, ఈశ్వరరావు, సత్తిబాబు, బాలబాబు, కామేశ్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో ప్రవేశాలు

జి.మాడుగుల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తునట్లు ఎస్‌వో కె.పద్మ తెలిపారు. ఈ నెల 22 నుంచి ఏప్రిల్ 11వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని కోరారు. 6వ తరగతిలో 40 సీట్లు, ఇంటర్ మొదటి సంవత్సరం బైపీసీలో 40సీట్లు, ద్వితీయ ఏడాదిలో 2సీట్లు, 7వ తరగతికి 3, 9వ తరగతికి 2, పదోతరగతికి 1 సీట్లు చొప్పున ఖాళీలున్నట్లు ఎస్‌వో చెప్పారు. వివరాలకు ఫోన్: 9347527010, 9441693087 సంప్రదించాలని కోరారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సీలేరు, మార్చి 25 , (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం సీలేరు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఏప్రిల్ ఒకటి నుంచి ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవచ్చునని ప్రిన్సిపాల్ వి. శంకరరావు తెలిపారు. కాలేజీలో హెచ్ఈసీ, సీఈసీ గ్రూ ప్‌లో చేరదలచిన విద్యార్థులు పదో తరగతి పరీక్ష హాల్ టిక్కెట్ , ఆధార్ కార్డుతో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశం పొంద వచ్చునన్నారు. ఏప్రిల్ ఒకటి నుంచి ఇంటర్ రెండవ తరగతి విద్యార్థులకు తరగతులు ప్రారంభం కానున్నట్టు చెప్పారు.

సీతారాముల కల్యాణ ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ



ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన మున్సిపల్ మాజీచైర్మన్ జగన్,తదితరులు

అనకాపల్లి టౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెయిన్‌రోడ్డులోని చినబజార్ వద్ద ఏప్రిల్ ఆరో తేదీన జరిగే సీతారాముల కల్యాణ మహోత్సవ ఆహ్వాన పత్రాలను మున్సిపల్ మాజీ చైర్మన్ కొణతాల జగన్ మంగళవారం ఆవిష్కరించారు. చినబజార్ వద్ద గల సీతారాముల కల్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ శాశ్వత అధ్యక్షుడు కె.నారాయణరావు, కార్యదర్శి సిరసపల్లి సూరిబాబు, కోశాధికారి డి.వెంకటేశ్వరరావు, సతివాడ దుర్గారావు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు తిమ్మాపాత్రుని వెంకటేష్, కార్యదర్శి సిరసపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల కోసం సీపీఐ ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఐ కార్యకర్తలు

పరవాడ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట పేదలు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలన్నారు.అనంతరం డిప్యూటీ తహసీల్దార్ కె. సురేశ్ నాయుడుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కన్వీనర్ బూసి పరమేశ్వరి, వి.రాజు, డి.హరీశ్, ఎన్.స్వప్న, కె.రమ్య, కె. లక్ష్మి, ఆశ, నారాయణమ్మ పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద తయారీపై శిక్షణ



శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీడీవో కె. ధర్మారావు

పరవాడ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీల్లో సేకరిస్తున్న చెత్త నుంచి సంపద ఎలా తయారు చేయాలో అనే అంశంపై మంగళవారం వాడచీపురుపల్లిలో పారిశుధ్య కార్మికులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కె. ధర్మారావు మాట్లాడుతూ తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలన్నారు. సేకరించిన చెత్తను ఎస్‌డబ్ల్యూపీ షెడ్‌కు తరలించాలన్నారు. ఎరువు తయారు చేయడానికి ఎలాంటి పద్ధతులు పాటించాలో వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మానవరపు అప్పలనాయుడు, పంచాయతీ కార్యదర్శి అచ్యుతరావు, ఉపసర్పంచ్ కూండ్రపు శ్రీనివాస్, కె.సీతారామయ్య, శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

సబ్బవరం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): సబ్బవరం మండల సర్వసభ్య సమావేశం బుధవారం జరుగుతుందని ఎంపీడీవో పిపద్మజ తెలిపారు. మండల పరిషత్తు సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి సభ్యులు, సర్పంచులు, అధికారులు హాజరుకావాలని ఆమె కోరారు.

వంగలిలో డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని ఆందోళన



వంగలిలో సీపీఎం నేతల ర్యాలీ

సబ్బవరం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వంగలిలో డ్రైనేజీ వ్యవస్థ అత్యంత అధ్వానంగా ఉందని, వెంటనే పరిష్కరించాలని మంగళవారం సీపీఎం మండల నాయకురాలు ఉప్పాడ సత్యవతి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వంగలిలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక రామాలయం నుంచి ఎస్సీ కాలనీ వరకూ డ్రైనేజీ లేక రోడ్డుపైనే మురుగు ప్రవహిస్తున్నదన్నారు. రోడ్డుపైనే చెత్తాచెదారం నిండి పోయి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనన్నారు. సచివాలయం వెనుక తాగునీటి ట్యాంక్ నుంచి నీరు వృథాగా పోతుందని కోరారు. కార్యక్రమంలో గ్రామస్థులు గవర రామునాయుడు, ఎస్. కృష్ణ, ఎర్రా సోంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించాలి

▸▸ డీఆర్‌వోకు బీఎస్పీ వినతి



డీఆర్‌వో సత్యనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న బీఎస్పీ నేత మాణిక్యాలరావు

కొత్తూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు తక్షణమే సొంత భవనాలు నిర్మాణాలు చేపట్టాలని బహుజన్ సమాజ్ పార్టీ అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి సూదికొండ మాణిక్యాలరావు జిల్లా రెవెన్యూ అధికారి సత్యనారాయణను కోరారు. ఈ మేరకు డీఆర్‌వోకు ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యాలయాలకు అద్దెల రూపంలో లక్షలాది రూపాయల ప్రజాధనం ఖర్చు అయిపోతుందని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రజా సంక్షేమానికి ఉపయోగపడాల్సిన నిధులు అద్దెలకు దుర్వినియోగం కాకుండా చూడాలన్నారు. ప్రభుత్వ స్థలాలు, భవనాలు పరిరక్షణకు ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కొల్లి చిన్న అప్పారావు, కార్యదర్శి చెవ్వేటి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నూకాంబిక అమ్మవారి ఊరేగింపు



ఊరేగింపులో దాండియా నృత్యం



నూకాంబికకు పూజ చేస్తున్న ఎమ్మెల్యే కొణతాల



ఊరేగింపులో నేల వేషం

అనకాపల్లి టౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక నూకాంబిక అమ్మవారి మాలధారణ సంఘం వ్యవస్థాపకులు పొలిమేర శ్రీను ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం అమ్మవారి ఊరేగింపు కన్నుల పండువగా సాగింది. నూకాంబిక అమ్మవారి 12 అడుగుల నూతన ఉత్సవమూర్తి విగ్రహాన్ని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆవిష్కరించి, పూజలు చేసి ఊరేగింపును ప్రారంభించారు. మొక్కుబడులలో భాగంగా పలువురు మాలధారణ భక్తులు శూలాలు ధరించారు. కొత్తఅమావాస్య జాతరలో భాగంగా ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా మాలధారణ భక్తులు ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపులో భాగంగా పులివేషాలు, దాండియా డాన్స్, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆలయం నుంచి ప్రారంభమైన అమ్మవారి ఉత్సవమూర్తి ఊరేగింపు సంతబయలు, చినరామస్వామికోవెల, సతకంపట్టు, గౌరీ సంఘం, పార్కు సెంటర్ మీదుగా మెయిన్ రోడ్డుకు వచ్చి చింతావారివీధి, వేగివీధి, అగ్గిమర్రిచెట్టు, దిబ్బవీధి మీదుగా కోటవీధికి చేరుకొని అక్కడి నుంచి ఆలయానికి చేరుకుంటుంది. మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రామకృష్ణ ప్రారంభించారు. ఈ ఊరేగింపులో ఆలయ ప్రత్యేకాధికారిణి కె.శోభారాణి, ఆలయ మాజీ చైర్మన్ బీఎస్ఎంకే జోగినాయుడు, ఆలయ ఉత్సవ కమిటీ ధర్మకర్తలు సూరే సతీష్, దాడి రవికుమార్, పొలిమేర ఆనంద్, మారిశెట్టి శంకరరావు, కాండ్రేగుల రాజారావు, మజ్జి శ్రీనివాసరావు, కొడుకుల శ్రీకాంత్, వద్దాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి, యర్రవరపు లక్ష్మి పాల్గొన్నారు.

మంచినీటి కేంద్రాన్ని ప్రారంభించిన కొణతాల

నూకాంబిక ఆలయ ఆవరణలో దివిస్ ల్యాబ్ సహకారంతో ఏర్పాటుచేసిన మంచినీటి సరఫరా కేంద్రాన్ని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ఆయన దర్శించుకుని పూజలు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులను ఎమ్మెల్యే సత్కరించి అభినందించారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

జాతర ఏర్పాట్లను పరిశీలించిన కొణతాల

అనకాపల్లి టౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర ఏర్పాట్లను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మంగళవారం సాయంత్రం పరిశీలించారు. అమ్మవారి పండగను రాష్ట్ర పండుగగా ప్రభుత్వం ప్రకటించినందున భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ అధికారిణి శోభారాణి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రామకృష్ణ, టీడీపీ నాయకుడు బీఎస్ఎంకే జోగినాయుడు, ధర్మకర్తలు దాడి రవికుమార్ పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల రిలే దీక్షలు

అనకాపల్లి టౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదుట ఎన్ఎంయూఏ కార్మికులు చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారం 25వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో ఆర్ఎస్ రావు, ఏఎస్ రావు, పి. మంగ, బీఎస్ఎం నారాయణ కూర్చున్నారు.

విస్సన్నపేట భూముల ఆక్రమణదారులకు అధికారులు వత్తాసు

▸▸ అక్రమ కట్టడాలను తక్షణమే కూల్చివేయాలి
▸▸ ఆర్డీవో కార్యాలయం ఎదుట జనసేన నేతల నిరసన
▸▸ ఆర్డీవో ఆఫీసు గోడకు వినతిపత్రం అంటించిన జనసేన నేతలు



ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న జనసేన పార్టీ నేతలు

కొత్తూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి):కశింకోట మండలం విస్సన్నపేటలో వివాదాస్పద భూముల ఆక్రమణదారులకు అధికారులు కొమ్ముకాయడం సరికాదంటూ జనసేన పార్టీ నేతలు ఆర్డీవో కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన చేశారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ నేత దూలం గోపి మాట్లాడుతూ.. బయ్యవరం రెవెన్యూ సర్వే నంబరు 195/2లో వివాదాస్పద భూములపై ప్రభుత్వం మారినా అధికారులు చర్యలు తీసుకోకపోవడం సరికాదన్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టిన కబ్జాదారులకు అధికారులు కొమ్ముకాయడం సిగ్గుచేటన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో అన్నీ తానే అయి వ్యవహరించిన అప్పటి తహశీల్దార్ సుధాకర్‌ను ఎన్నికలకు ముందు సస్పెండ్ చేసినప్పటికీ తిరిగి అదే ఆర్డీవో కార్యాలయానికి ఏవోగా ఏవిధంగా తీసుకువచ్చారని ప్రశ్నించారు. ప్రస్తుత కశింకోట తహశీల్దార్ శ్రీనివాసరావు ఒత్తిడి తట్టుకోలేకే సెలవుపై వెళ్లినట్టు ప్రచారం జరుగుతోందన్నారు. వివాదాస్పద భూములకు సంబంధించి అన్ని అనుమతులకు డిప్యూటీ తహశీల్దార్‌పై ఒత్తిడి తెస్తున్నారన్నారు. ఈ విషయాలన్నీ జేసీ దృష్టికి తాను తీసుకు వెళితే.. ఆ భూములపై నివేదికను సిద్ధం చేయమని ఆర్డీవోకు ఆదేశించారన్నారు. అయితే మంగళవారం తాము ఆర్డీవో కార్యాలయానికి వెళ్లి వివరించేందుకు ప్రయత్నించగా ఆమె అందుబాటులో లేరన్నారు. గంటల తరబడి వేచి ఉన్నా ఆర్డీవో రాకపోవడం వెనుక ఆంతర్యమేంటో తెలియజేయాలన్నారు. అందుకు నిరసనగా ఆర్డీవో కార్యాలయం గోడకు వినతిపత్రం అంటించి రావాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. తక్షణమే వివాదాస్పద భూములపై నిగ్గు తేల్చకుంటే భవిష్యత్తులో పరిణామాలు తీవ్రంగా ఉంటాయని గోపీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నేతలు అప్పికొండ గణేష్, భర్నికాన రాము, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను బకాయిల చెల్లింపుపై 50 శాతం వడ్డీ రాయితీ

విశాఖపట్నం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్ను, వీఎల్‌టీ (ఖాళీ స్థలాలపై పన్ను) బకాయిల చెల్లింపుపై 50 శాతం వడ్డీ రాయితీ ప్రకటిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసిందని జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు. నగర పరిధిలోని గృహ యజమానులు, స్థలాలు కలిగినవారు ప్రభుత్వం కల్పించిన ఈ సదావకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్ను ఇంకా చెల్లించనివారు మొదటి అర్థ సంవత్సరం పన్నుపై వడ్డీ కూడా చెల్లించాల్సి ఉంటుందని, అలాంటి వారంతా సంవత్సరం పన్నును ఈనెల 31లోపు ఒకేసారి చెల్లిస్తే...వారికి వడ్డీపై 50 శాతం రాయితీ లభిస్తుందని జీవీఎంసీ రెవెన్యూ విభాగం డిప్యూటీ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. అలాగే గత కొన్నేళ్లుగా పన్ను చెల్లించకుండా ఉండిపోయినవారు ఈనెల 31లోగా మొత్తం చెల్లించేస్తే వడ్డీలో 50 శాతం మినహాయింపు వర్తిస్తుందని వివరించారు. ఆస్తి పన్నును అన్ని జోనల్ కార్యాలయాల్లోని సౌకర్యం కేంద్రాలతోపాటు సిరిపురంలోని ఐడీబీఐ బ్యాంక్, ద్వారకానగర్ ఐసీఐసీఐ బ్యాంక్, రామ్‌నగర్‌లోని యాక్సిస్ బ్యాంకుల్లో చెల్లించేందుకు అవకాశం ఉంటుందన్నారు. అలాగే వార్డు సచివాలయాల వద్ద కూడా పన్ను చెల్లించే వెసులుబాటు కల్పించామన్నారు.

స్వల్ప ధరలకు ఎరువులు, పురుగుల మందులు పంపిణీ

తుమ్మపాల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి పశువైద్య కేంద్రంలో పాడి రైతులకు స్వల్ప ధరలకే ఎరువులు, పురుగు మందులను పంపిణీ చేస్తున్నట్టు పశుసంవర్థక శాఖ ఏడీ డాక్టర్ సౌజన్య పేర్కొన్నారు. మంగళవారం అనకాపల్లి పశువైద్య కేంద్రంలో పాడి రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు సంఘాలుగా ఏర్పడాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు డాక్టర్ అనిల్, డాక్టర్ రామారావు, డాక్టర్ శ్యామల తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ కేంద్రం ప్రారంభం

తుమ్మపాల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిడిపాలెం జడ్పీ హైస్కూల్‌లో మంగళవారం గ్రామ సర్పంచ్ పూడి పరదేశినాయుడు సొంత నిధులతో మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థులకు నిత్యం మజ్జిగను అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

వైస్ ఎంపీపీ-2 ఎన్నిక రేపు

▸▸ కూటమి ఎంపీటీసీ సభ్యునికి అవకాశం?
▸▸ పావులు కదుపుతున్న నేతలు
▸▸ వైసీపీ క్యాంప్ రాజకీయం

సబ్బవరం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : సబ్బవరం వైస్ ఎంపీపీ-2 ఎన్నిక గురువారం నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అంతకాపల్లి ఎంపీటీసీ సభ్యుడు చిక్కాకుల గోవింద ఈ పదవికి గతేడాది 22న రాజీనామా చేయడంతో ఎన్నికలు అనివార్యమయ్యాయి. మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ఈ ఎన్నికలు రిటర్నింగ్ అధికారి రమాదేవి నిర్వహిస్తారు. ఉదయం 11 గంటలకు సభ్యులు హాజరు కావలసి ఉంది. మెజార్టీ సభ్యులు చేతులు ఎత్తే పద్ధతిలో ఎన్నిక నిర్వహిస్తారు. ఎమ్మెల్యే, ఎంపీ కూడా కార్యక్రమానికి హాజరు కావచ్చని ఎంపీడీవో పద్మజ తెలిపారు. పటిష్ఠ బందోబస్తు మధ్య ఎన్నికలు జరుగుతాయన్నారు.

మండల పరిషత్తు ఎన్నికల్లో 19 ఎంపీటీసీ స్థానాలకు గాను 15 స్థానాలు వైసీపీ, 4 స్థానాలు టీడీపీ గెలుకున్నాయి. దీంతో వైసీపీకి చెందిన సభ్యులు ఎంపీపీగా, వైస్‌ఎంపీపీ-1,-2లుగా ఎంపికయ్యారు. అయితే వైస్ ఎంపీపీ పదవికి పోటీ ఎక్కువగా ఉండడంతో రెండున్నరేళ్ల తరువాత ఇద్దరు రాజీనామా చేసి, మరో ఇద్దరికి అవకాశం ఇవ్వాలని వైసీపీ పెద్దలు అగ్రిమెంట్ కుదిర్చారు. అనంతరం సార్వత్రిక ఎన్నికలు రావడంతో ముగ్గురు వైసీపీ ఎంపీటీసీ సభ్యులు జనసేనలో చేరారు. అందులో ఆరిపాక ఎంపీటీసీ, వైస్ ఎంపీపీ-1 ఉన్నారు. ఆమె అగ్రిమెంట్ ప్రకారం రాజీనామా చేయలేదు. అయితే వైస్‌ఎంపీపీ-2 చొక్కకుల గోవింద రాజీనామా చేశారు. అయితే ఇప్పుడు కూటమికి ఏడుగురు ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు. మరో ముగ్గురు గురువారం నాటికి తమ గూటికి చేరుకునేలా కూటమి నేతలు పావులు కదుపుతున్నారు. ఈ విషయం గ్రహించిన వైసీపీ పెద్దలు ఏడుగురు సభ్యులను ఇప్పటికే అరకులో క్యాంప్ శిబిరానికి తరలించినట్టు తెలిసింది. రేపటికి మిగతా సభ్యులను కూడా అరకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నారని విశ్వసనీయ సమాచారం. కాగా ఇప్పటికే తమతో ముగ్గురు వైసీపీ ఎంపీటీసీ సభ్యులు టచ్‌లో ఉన్నారని, కూటమి నేతలు ధీమాగా ఉన్నారు. వైస్‌ఎంపీపీ-2 అభ్యర్థి ఎవరనేది ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, టీడీపీ పెందుర్తి ఇన్‌చార్జి గండి బాబ్జీ కలిసి గురువారం ఎంపిక చేయనున్నారు.

28 నుంచి రైతుభారతిలో నాటికల ఉత్సవాలు

▸▸ టీడీపీ నేత దాడి రత్నాకర్



నాటికల ఉత్సవం కరపత్రాన్ని ఆవిష్కరించిన దాడి రత్నాకర్

అనకాపల్లి టౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : ఉగాది పండుగ సందర్భంగా స్థానిక వీవీ రమణ రైతు భారతిలో జ్యోతి సరళ స్మారక కళాపరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 28, 29, 30 తేదీల్లో నాటికల ఉత్సవాలను నిర్వహిస్తున్నట్టు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ అన్నారు. రైతు భారతిలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డైమండ్ హిట్స్ వ్యవస్థాపకులు దాడి వీరభద్రరావు సౌజన్యంతో 1975 మున్సిపల్ స్కూల్ పూర్వ విద్యార్థుల సహకారంతో పరిషత్ ఈ నాటికలను నిర్వహిస్తుందన్నారు. ఈ నాటికలన్నీ ప్రముఖ రచయిత ఆకెళ్ల సూర్యనారాయణ రచించినవేనన్నారు. 28వ తేదీ సాయంత్రం ఆరు గంటలకు పెద్దలకు మాత్రమే, సహప్రయాణం నాటికలు, 29న సాయంత్రం జీవన వేదం, రాత్రికి జరుగుతున్న కథ, 30న సాయంత్రం రేపటి శత్రువు, రాత్రికి కొత్త సైన్యం నాటికలను ప్రదర్శింపబడతాయని రత్నాకర్ తెలిపారు. ఉగాది రోజున రచయిత ఆకెళ్ల సూర్యనారాయణను సత్కరించనున్నట్టు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో జ్యోతి సరళ స్మారక కళాపరిషత్ వ్యవస్థాపకులు పీసీహెచ్ నాయుడు, కేఎం నాయుడు, విల్లూరి రాము, శిలపరశెట్టి బాబి, జి.కన్నబాబు, వీవీ రామారావు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవార్ల పండగ



ఊడేరులో చింతాలమ్మని దర్శించుకుంటున్న మళ్ల సురేంద్ర

తుమ్మపాల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మపాలలో మరిడిమాంబ, ఊడేరు గ్రామంలో చింతాలమ్మ అమ్మవార్ల పండగలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయాల్లో తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు జరిగాయి. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవార్లకు సారె, చీరలను సమర్పించి పూజలు నిర్వహించారు. ఊడేరులో చింతాలమ్మ అమ్మవారిని రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర దర్శించుకొని ప్రత్యేక పూజలను చేపట్టారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయాల కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

ఆరోగ్యవంతమైన గ్రామాలకు కృషిచేయాలి

▸▸ ఈవోపీఆర్డీ వెంకటలక్ష్మి



పారిశుధ్య కార్మికుల పనితీరును పరిశీలిస్తున్న ఈవోపీఆర్‌డీ వెంకటలక్ష్మి

కశింకోట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన గ్రామాల కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈవోపీఆర్డీ వెంకటలక్ష్మి పిలుపునిచ్చారు. మంగళవారం ఆమె చింతలపాలెం, గొబ్బూరు, పరవాడపాలెం, ఇ.చౌడువాడ గ్రామాల్లో పర్యటించి పారిశుధ్యం, సంపద కేంద్రాలను పరిశీలించారు. పరిసరాలన్నీ పరిశుభ్రంగా ఉంచుకునేలా గ్రామస్థులకు అవగాహన కల్పించాలన్నారు. చెత్తను రోడ్లపై వేయకుండా తడి, పొడి చెత్తలను వేరు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

సస్పెండ్ చేసిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

▸▸ ఎన్ఎంయూఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు



చలో ఆర్టీసీ డిపో కార్యక్రమానికి తరలివచ్చిన ఎన్ఎంయూఏ కార్మికులు

అనకాపల్లి టౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి డిపోలో అక్రమంగా సస్పెన్షన్ చేసిన కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని ఎన్ఎంయూఏ రాష్ట్ర ప్రధానకార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మంగళవారం అసోసియేషన్ ప్రతినిధులు చలో అనకాపల్లి డిపో కార్యక్రమానికి పిలుపునివ్వగా జిల్లాలోని కార్మికులతోపాటు విజయనగరం జోన్‌లోని పలు జిల్లాల అసోసియేషన్ ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డిపో ఎదుట జరిగిన సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ 1/2019 సర్క్యులర్‌ను అమలు చేయాలని, లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. తప్పుడు కేసులు రాసిన తనిఖీ అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. సర్క్యులర్‌ను ఉల్లంఘించి ఉద్యోగులను అక్రమంగా సస్పెన్షన్ చేసిన డిపో మేనేజర్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి మోహన్, కార్యదర్శులు నరసింగరావు, సురేష్‌నాయుడు, జోనల్ కార్యదర్శి బీఎస్. రాములు, పి. సుధాకర్, డిపోల అధ్యక్ష, కార్యదర్శులు, అధిక సంఖ్యలో ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలపై రాజీలేని పోరాటం

ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి జి.ఆంజనేయులు



మాట్లాడుతున్న ఆంజనేయులు

తుమ్మపాల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాజీలేని పోరాటం చేస్తుందని ఆ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి జి.ఆంజనేయులు అన్నారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ అనకాపల్లి జిల్లా సర్వసభ్య సమావేశం మంగళవారం పట్టణంలోని తాటికొండ నూకయ్యశెట్టి మెమోరియల్ హాల్‌లో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆంజనేయులు మాట్లాడుతూ జర్నలిస్టులకు వైద్యం, బీమా సదుపాయాల విషయంలో ప్రభుత్వాలు అలసత్వం చూపడం తగదన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కోసం ప్రత్యేక కార్యాచరణతో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని చెప్పారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర నాయకులు కొండబాబు మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యంగా ఫెడరేషన్ పనిచేస్తోందన్నారు. జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలను త్వరలోనే కూటమి నాయకుల దృష్టికి తీసుకువెళతామని హామీఇచ్చారు. జిల్లా కార్యదర్శి ఈశ్వరరావు అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు బి.వెంకటేష్, జర్నలిస్టు సంఘ నాయకులు జి.శ్రీనివాసరావు, ఎ. సాంబశివరావు, ఆనంద్, జి. రాంబాబు, ఈశ్వరరావు, మదన్, శ్రీనివాస్ పాల్గొన్నారు. అనంతరం అనకాపల్లి జిల్లా ఫెడరేషన్, బ్రాడ్ కాస్టింగ్ అసోసియేషన్ కార్యవర్గాల ఎన్నికలు జరిగాయి.

విశ్వహిందూ పరిషత్ సర్వే నిలుపుదల చేయాలి

కలెక్టర్‌కు సీపీఎం జిల్లా కార్యదర్శి లేఖ

అనకాపల్లి టౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్ నిర్వహించే సర్వేను తక్షణమే నిలుపుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి. కోటేశ్వరరావు మంగళవారం జిల్లా కలెక్టర్‌ను ఒక లేఖలో కోరారు. ఈ సర్వే కారణంగా మత ఘర్షణలు జరిగే ప్రమాదముందని, తక్షణమే నిలిపివేయాలని కోరారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో విశ్వహిందూ పరిషత్ ఒక సర్వే చేపట్టిందన్నారు. ప్రధానంగా క్రైస్తవ, మైనార్టీలను లక్ష్యంగా చేసుకొని సర్వే జరుగుతుందన్నారు.

ప్రజల సమస్యలు తెలుసుకోవడానికో, వారి సామాజిక ఆర్థిక కుటుంబ పరిస్థితులను తెలుసుకోవడానికి సర్వేలు చేయడం సర్వసాధారణమన్నారు. కానీ అసాధారణమైన రీతిలో విశ్వహిందూపరిషత్ చాలా గోప్యంగా మతాల పేరుతో సర్వేలు నిర్వహిస్తుందని పేర్కొన్నారు. తక్షణమే జోక్యం చేసుకొని సర్వేను నిలుపుదల చేయించాలని ఆయన కోరారు.

మ్యాట్రిమోనీ ఫ్రాడ్స్

ఎన్ఆర్ఐ సంబంధాల పేరుతో వల

- వెబ్‌సైట్‌లో ప్రొఫైల్ ఆధారంగా సైబర్ నేరగాళ్ల మోసాలు
- బాధితుల్లో మహిళలే అధికం
- అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్న సైబర్ క్రైమ్ పోలీసులు

- అమెరికా, కెనడాలో ఉన్నత ఉద్యోగాల్లో ఉన్నామంటూ పరిచయం
- విదేశీ సంబంధాల మోజులో మోసపోతున్న బాధితులు
- ఇటీవల కాలంలో మళ్లీ నమోదవుతున్న కేసులు
- పరువుపోతుందని చెప్పుకోలేకపోతున్న బాధితులు
- కొద్దిమంది మాత్రమే పోలీసులకు ఫిర్యాదు



(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

'మధురవాడలో నివసిస్తున్న ఓ వైద్యురాలికి 30 ఏళ్లు నిండినా వివాహం కాలేదు. మంచి సంబంధం కోసం ఓ మ్యాట్రిమోనీ వెబ్‌సైట్‌లో ప్రొఫైల్ అప్‌లోడ్ చేశారు. అమెరికాలో వైద్యుడినంటూ ఓ వ్యక్తి ఆమెకు ఫోన్ చేసి పరిచయం చేసుకున్నారు. తన తల్లిదండ్రులు వైద్యులేనని, ఏళ్ల కిందటే అమెరికాలో స్థిరపడ్డారని నమ్మించాడు. పెళ్లి చేసుకుంటానని, కలిసేందుకు ఇండియా వస్తున్నానని విమానం టికెట్టు కూడా వాట్సాప్‌లో పంపించాడు. ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో ఇమ్మిగ్రేషన్ అధికారులు నిర్బంధించారంటూ ఎవరితోనో మాట్లాడించి దశల వారీగా రూ.ఐదు లక్షలు గుంజేశాడు.'

'నగరానికి చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగిని రెండో పెళ్లి కోసం మ్యాట్రిమోని వెబ్‌సైట్‌లో తన ప్రొఫైల్ పెట్టారు. ఆ తరువాత ఓ వ్యక్తి ఫోన్‌చేసి తాను అమెరికాలో వుంటున్నానని, పెళ్లి చేసుకుని ఇండియాలో సెటిల్ అయిపోదామనుకుంటున్నానని చెప్పాడు. ఆమె కూడా మొగ్గుచూపింది. విలువైన బహుమతులు తీసుకు వస్తుండగా ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో నిర్బంధించారని, తన వద్ద ఇండియా కరెన్సీ లేదని చెప్పడంతో ఆమె రూ.4.82 లక్షలు అతని ఖాతాకు ట్రాన్స్‌ఫర్ చేసింది. ఇంకా కావాలని కోరడంతో మోసపోయినట్టు గుర్తించి సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.'

నగరంలో మ్యాట్రిమోనీ ఫ్రాడ్స్ ఇటీవల మళ్లీ పెరుగుతున్నాయి. పెళ్లి కోసం మ్యాట్రిమోనీ వెబ్‌సైట్లలో ప్రొఫైల్ పెట్టే మహిళలే బాధితులుగా మారుతున్నారు. వారిలో కూడా బాగా చదువు, ఉన్నత స్థానంలో ఉన్నప్పటికీ మంచి సంబంధాలు రాని యువతులు, రెండో పెళ్లి కోసం ప్రయత్నించే మహిళలను లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. అలాంటివారి ప్రొఫైల్స్‌ను మ్యాట్రిమోనీ వెబ్‌సైట్లలో పరిశీలిస్తున్న మోసగాళ్లు తాము అమెరికా, కెనడా వంటి దేశాల్లో దశాబ్దాల కిందటే సెటిల్ అయిన కుటుంబాలకు చెందిన ఎన్ఆర్ఐలమంటూ పరిచయం చేసుకుని ముగ్గులోకి దింపుతున్నారు. వైద్య వృత్తి, సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలంటూ మాటలు కలుపుతున్నారు. ఆర్థికంగా స్థితిమంతులమని, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కుటుంబసభ్యులు ఇష్టపడతారు కాబట్టి భారతీయురాలిని పెళ్లి చేసుకుంటామని నమ్మిస్తున్నారు. అమెరికా సంబంధం, అందులోనూ ఆర్థికంగా ఉన్నవారు అనేసరికి వారిమాయలో పడిపోతున్నారు. వారి కల్లబొల్లి మాటలను నమ్మి మోసపోతున్నారు. నైజీరియా, చైనా, కొలంబియా వంటి దేశాలకు చెందిన కొందరు సైబర్ నేరాలే వృత్తిగా భారతీయులను మోసం చేసి డబ్బు గుంజేస్తున్నారు.



మ్యాట్రిమోనీ సైట్స్ లక్ష్యం

ప్రస్తుతం పెళ్లి సంబంధాల కోసం మ్యాట్రిమోనీ వెబ్‌సైట్లలో ప్రొఫైల్ పెట్టడం సాధారణంగా మారింది. దీంతో ఆయా వెబ్‌సైట్లనే మోసాలకు ఆసరాగా మార్చుకుంటున్నారు. వాటిలో అప్‌లోడ్ చేసిన ప్రొఫైల్‌లోని ఫోన్ నంబర్‌కు విదేశీ నంబరుతో ఫోన్ చేసి తాము అమెరికా, కెనడా తదితర దేశాలకు చెందినవారిగా పరిచయం చేసుకుంటున్నారు. వైద్యుడిగానో, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గానో స్థిరపడి, భారీగా సంపాదిస్తున్నానని, తల్లిదండ్రులు కూడా స్థితిమంతులని ఆకట్టుకుంటున్నారు. భారతీయ మహిళను పెళ్లి చేసుకోవాలనే ఆసక్తి ఉందంటూ వల విసురుతున్నారు. విలాసవంతమైన ఇంట్లో నివసిస్తున్నామని, ఇంటర్నెట్ నుంచి డౌన్‌లోడ్ చేసిన ఫొటోలను వాట్సాప్‌లో పంపిస్తున్నారు. ఎలాంటి కట్టుబాట్లు వుండవని, ఎవరి అభీష్టం మేరకు వారు జీవితం గడపవచ్చని ఆకర్షిస్తున్నారు. వారుచెప్పిందంతా నిజమేననే భ్రమలో మరో ఆలోచనలేకుండా సంబంధం కుదుర్చుకునేందుకు కొంతమంది మహిళలు పరితపిస్తున్నారు.

ఇమ్మిగ్రేషన్ పేరుతో గిమ్మిక్కులు

పెళ్లి ఇష్టమైతే తానే ఇండియా వచ్చి మాట్లాడతానంటూ మోసగాళ్లు వలలోకి లాగుతున్నారు. వచ్చినపుడు ఖరీదైన బహుమతులు తెస్తాననడం, నమ్మకం కలిగించేందుకు విమాన టికెట్లను వాట్సాప్‌లో పంపడంతో బాధితులు ఆశగా ఎదురుచూస్తుంటారు. రెండు రోజులు గడిచిన తర్వాత విమానంలో కూర్చున్న ఫొటోలను పంపిస్తున్నారు. కొంతసేపటికే ఢిల్లీ ఎయిర్‌పోర్టులో దిగానని, అమెరికన్ కరెన్సీతోపాటు తనవెంట తెచ్చిన ఖరీదైన బహుమతులను సీజ్ చేశారని కట్టుకథ అల్లుతున్నారు. విడిచిపెట్టాలంటే జరిమానా చెల్లించాలని మభ్యపెడుతున్నారు. కస్టమ్స్ అధికారులు మాట్లాడుతారంటూ ఎవరికో ఫోన్ ఇచ్చి మాట్లాడిస్తున్నారు. ఇదంతా నిజమేనని భ్రమించిన బాధితులు వారు చెప్పిన ఖాతాకు నగదు బదిలీ చేస్తున్నారు. ఇలా వీలైనంతవరకు లాగేసి, బాధితులకు అనుమానం వచ్చిన తర్వాత ఫోన్ స్విచ్ఛాఫ్ చేస్తున్నారు. దీంతో బాధితులు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయిస్తున్నారు.



ఇటీవలి సంఘటన

మధురవాడలోని ఓ వైద్యురాలు మ్యాట్రిమోనీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన ప్రొఫైల్ చూసి, అమెరికా నుంచి అంటూ ఓ ఫోన్ వచ్చింది. తనకు సంబంధం నచ్చిందని, ఇండియా వచ్చి మాట్లాడుతానని చెప్పడంతో నిజమేనని నమ్మారు. తర్వాతరోజు ఢిల్లీలో తనను ఇమ్మిగ్రేషన్ అధికారులు నిర్బంధించారని మోసగాడు ఫోన్‌చేశాడు. తనవద్ద ఇండియన్ కరెన్సీ లేకపోవడంతో ఇరుక్కుపోయానని నమ్మబలికాడు. దీంతో వైద్యురాలు రూ.2.1 లక్షలు సైబర్‌నేరగాడు చెప్పిన అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు. తర్వాత కొంతసేపటికి తనవద్ద ఉన్న బహుమతులకు పన్ను కట్టాలని, లేదంటే సీజ్‌చేస్తామంటున్నారని ఫోన్‌చేయడంతో తన వద్ద డబ్బులేదని వైద్యురాలు చెప్పేశారు. దీంతో కస్టమ్స్ అధికారి పేరుతో వేరొకరితో మాట్లాడించాడు. ఎవరివద్ద అయినా తీసుకుని గండం గట్టెక్కిస్తే తాను వచ్చాక ఇండియన్ కరెన్సీలోకి మార్చి వెనక్కి ఇచ్చేద్దామని నమ్మించాడు. దీంతో రూ.3 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్‌ను విత్‌డ్రా చేసి ట్రాన్స్‌ఫర్ చేశారు. అయినా మళ్లీ డబ్బులు అడగడంతో అనుమానం వచ్చి స్నేహితుల ద్వారా ఆరా తీయగా అదంతా మోసమని తేలింది. దీంతో సైబర్‌క్రైమ్ పోలీసులను ఆశ్రయించడంతో వారు కేసు నమోదుచేసి ప్రస్తుతం దర్యాప్తు చేస్తున్నారు.

క్రైం... crime news

ఎంబీ పట్నంలో వివాహిత ఆత్మహత్య



వెంకటలక్ష్మి (ఫైల్ ఫొటో)

నాతవరం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎంబీ పట్నం గ్రామంలో మంగళవారం ఓ వివాహిత నిప్పు అంటించుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... ఎంబీ పట్నం గ్రామంలో పల్లి గోవింద్, వెంకటలక్ష్మి దంపతులు నివసిస్తున్నారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె జ్వరంతో రెండు రోజుల నుంచి బాధ పడుతున్నది. అయితే చెప్పిన మాట వినలేదని కుమార్తెను తల్లి వెంకటలక్ష్మి కొట్టింది. జ్వరంతో ఉన్న పాపను ఎందుకు కొట్టావని భర్త గోవింద్ మందలించి పొలానికి వెళ్లాడు. దీంతో వెంకటలక్ష్మి క్షణికావేశంతో ఇంటి దగ్గర ఎవ్వరూ లేని సమయంలో కిరోసిన్ పోసుకుని నిప్పు అంటించుకుంది. తీవ్రంగా గాయపడి మృతి చెందింది. నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ, ఇన్‌చార్జి ఎస్ఐ రాజారావు సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు పోలీసులు తెలిపారు.

ఫోన్ చేసి బెదిరిస్తున్నారు..

- పోలీసులకు ఎంబీ పట్నం సర్పంచ్ ఫిర్యాదు



పోలీసులకు ఫిర్యాదు చేసిన ఎంబీ పట్నం సర్పంచ్ ఝాన్సీరాణి

నాతవరం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఫోన్‌లో బెదిరిస్తున్నారంటూ ఎంబీ పట్నం సర్పంచ్ కాళ్ల ఝాన్సీరాణి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి రుణం తీసుకున్నప్పుడు తన నంబరు ఇచ్చాడని, అందువల్ల తానే లోన్ చెల్లించాలని రోజూ ఫోన్‌లో బెదిరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అసలు లోన్ ఎవరు తీసుకున్నారో కూడా తనకు తెలియదని చెబుతున్నప్పటికీ, సదరు వ్యక్తి ఫోన్ నంబరు ఎందుకు ఇచ్చారని అసభ్యకరంగా మాట్లాడుతున్నారని తెలిపారు. 9076328962 సెల్ నంబర్ నుంచి బెదిరింపు కాల్స్ వస్తున్నాయని, పోలీసులు విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని సర్పంచ్ కోరారు.

పది మద్యం సీసాలు స్వాధీనం

అనకాపల్లి టౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెరుగుబజారు వద్ద మంగళవారం ఒక వ్యక్తి నుంచి పది మద్యం క్వార్టర్ సీసాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్ఐ డి.ఈశ్వరరావు తెలిపారు. అనకాపల్లి మండలం సీతానగరం గ్రామానికి చెందిన ఎస్ఎన్ఆర్ అప్పారావు వైన్‌షాపులో మద్యం కొనుగోలు చేసి స్వగ్రామానికి వెళ్తుండగా పెరుగుబజారు వద్ద హెడ్‌కానిస్టేబుల్ ఎ.శ్రీనివాసరావు, కానిస్టేబుల్ శివాజీ తనిఖీ చేసి పది మద్యం క్వార్టర్ సీసాలను స్వాధీనం చేసుకున్నారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

బయ్యవరం భూదందాపై చర్యలకు మీనమేషాలు

... 5వ పేజీ తరువాయి

విచారణ జరిపారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తరువాత కూడా ఆ కమిటీ నివేదికను బహిర్గతం చేయలేదు. మరోవైపు జనసేన నాయకులు చేసిన ఫిర్యాదుపై స్పందించిన లోకాయుక్త.. ఈ వ్యవహారంపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. అప్పటి అనకాపల్లి ఆర్డీఓ విచారణ జరిపించి నివేదికను లోకాయుక్తకు అందజేశారు. దీని వివరాలు సైతం బహిర్గతం కాలేదు. విస్సన్నపేట భూముల్లో లేవుట్ వేసిన రియల్టర్ తాజాగా రూటు మార్చి, కూటమి పార్టీలకు చెందిన కొంతమంది నేతలతో మంతనాలు జరుపుతున్నట్టు తెలిసింది. ఈ కారణంగానే తాము ఫిర్యాదులు చేసినప్పటికీ రెవెన్యూ అధికారులు స్పందించడంలేదని జనసేన నాయకులు ఆరోపిస్తున్నారు.

వైసీపీ అధికారంలో వున్నప్పుడు కశింకోట మండలం బయ్యవరం రెవెన్యూ పరిధిలోని విస్సన్నపేట, జమాదులపాలెం గ్రామాల మధ్యలో సర్వే నంబరు 195/2లో వున్న సుమారు 610 ఎకరాలను చదును పేరుతో భారీ లేఅవుట్‌కు ప్లాన్ వేశారు. ఇందులో సుమారు 300 ఎకరాలు మాత్రమే జిరాయితీ వుండగా, మిగిలినవి ప్రభుత్వ భూములు, పేదలు సాగు చేసుకుంటున్న డి.పట్టా భూములు, వాగులు, గెడ్డలు వున్నాయి. జిరాయితీ భూములతోపాటు వీటిని ఆనుకుని వున్న ప్రభుత్వ భూముల్లోని కొండలను భారీ యంత్రాలతో ధ్వంసం చేశారు. సమీపంలో రంగబోలుగెడ్డ రిజర్వాయర్‌లోకి నీరు వెళ్లే వాగులను మట్టి, గ్రావెల్, రాళ్లతో పూడ్చివేశారు. భూముల చదును పేరుతో సరిహద్దులను ధ్వంసం చేయడంతో ఏది జిరాయితీ? ఏది డి.పట్టా భూమి? ఏది ప్రభుత్వ భూమి? అన్నది తెలియకుండా పోయింది. అంతేకాక 'వింటేజ్ మౌంట్ వ్యాలీ రిసార్టు' పేరుతో ఆకర్షణీయంగా బ్రోచర్లు ముద్రించి విస్తృతంగా ప్రచారం చేశారు. వీఎంఆర్‌డీఏ నుంచి ఎటువంటి అనుమతులు పొందలేదు. భూములను చదును చేయడానికి, ఒకచోట తవ్విన మట్టిని మరోచోటుకు తరలించడానికి గనుల శాఖ అనుమతులు తీసుకోలేదు. భూములను చదును చేసే క్రమంలో 'వాల్టా' చట్టాన్ని ఉల్లంఘించి వేలాది చెట్లను నరికివేశారు. సహజసిద్ధ నీటి వనరులను ధ్వంసం చేశారు. వీటిపై మీడియాలో కథనాలు రావడంతో రెవెన్యూ అధికారులు మొక్కుబడిగా వెళ్లి పరిశీలించి వచ్చారే తప్ప పనులు మాత్రం నిలుపుదల చేయించలేదు. టీడీపీ, జనసేన నాయకులు పలుమార్లు చేసిన ఫిర్యాదులను బుట్టదాఖలు చేశారు. ఇక్కడ లేఅవుట్ వేస్తున్న రియల్టర్ వెనుక నాడు మంత్రిగా పనిచేసిన ఓ నేత వుండడమే ఇందుకు కారణమన్న ఆరోపణలు వచ్చాయి. గత సాధారణ ఎన్నికల ముందు జనసేన అధినేత పవన్‌కల్యాణ్ విస్సన్నపేట ప్రాంతాన్ని సందర్శించి, తాము అధికారంలోకి రాగానే వైసీపీ నేతల భూదందాలపై విచారణ జరిపిస్తామని ప్రకటించారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత విస్సన్నపేట భూ ఆక్రమణలపై విచారణ జరుగుతుందని అంతా భావించారు. కానీ తొమ్మిది నెలలు దాటినా ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తున్నది.

నివేదికలు ఏమయ్యాయి?

విస్సన్నపేట భూదోపిడీపై వైసీపీ అధికారంలో వున్నప్పుడు మీడియాలో కథనాలు రావడంతో అప్పటి ఉమ్మడి విశాఖపట్నం జిల్లా కలెక్టర్ నేతృత్వంలో కమిటీ వేశారు. నివేదికను ప్రభుత్వానికి సమర్పించారు. కానీ ఇంతవరకు బహిర్గతం చేయలేదు. మరోవైపు జనసేన నాయకులు కూడా విస్సన్నపేట భూదోపిడీపై విచారణ జరిపించాలని లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన లోకాయుక్త.. విస్సన్నపేట భూ ఆక్రమణలపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీనిపై అప్పటి అనకాపల్లి ఆర్డీఓ చిన్ని కృష్ణ నేతృత్వంలో విచారణ జరిపించి నివేదికను లోకాయుక్తకు అందజేశారు. దీని వివరాలు కూడా ఇంతవరకు వెల్లడించలేదు.

రూటు మార్చిన రియల్టర్

విస్సన్నపేట భూముల్లో నిబంధనలకు విరుద్ధంగా, నాడు మంత్రిగా పనిచేసిన ఓ నేత అండదండలతో లేఅవుట్ వేసిన రియల్టర్.. ఇప్పుడు కూటమి పార్టీల్లో కొంతమంది నేతలతో రహస్య మంతనాలు జరుపుతున్నట్టు తెలిసింది. భూ కబ్జాలు, ఇతర ఉల్లంఘనలపై వచ్చిన ఫిర్యాదులపై విచారణ జరగకుండా పైస్థాయి నుంచి జిల్లా అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్టు సమాచారం. ఈ కారణంగానే రెవెన్యూ అధికారులు గతంలో మాదిరిగానే ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారితో సంబంధాలున్న స్థానిక బడా నేత ఒకరు తెర వెనుక ఉండి కథ నడిపిస్తున్నారని తెలిసింది. కాగా విస్సన్నపేట భూదోపిడీ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించి ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని, ప్రకృతి వనరులను ధ్వంసం చేసినందుకు చట్టపరంగా చర్యలు చేపట్టాలని జనసేన అనకాపల్లి జిల్లా అధికార ప్రతినిధి దూలం గోపీ అధికారులకు ఇటీవల ఫిర్యాదు చేశారు. కానీ ఇంతవరకు స్పందన లేదు. ముందుగా అనుమతి తీసుకొని ఫిర్యాదు అందించేందుకు కార్యాలయానికి వెళితే.. అధికారులు అందుబాటులో ఉండడం లేదు. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ స్పందించి, విస్సన్నపేటలో ఆక్రమణకు గురైన భూములను స్వాధీనం చేసుకోవాలని డి.గోపి డిమాండ్ చేస్తున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	88.00
లైవ్ ధర	108.00
విత్ స్కిన్	186.00
స్కిన్ లెస్	196.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	400
విజయనగరం	404
శ్రీకాకుళం	404

విద్యుత్ అంతరాయాలకు చెక్

... 5వ పేజీ తరువాయి

అధికారులు అంచనా వేశారు. విద్యుత్ వినియోగం పెరిగినప్పుడు ట్రాన్స్‌ఫారాల సామర్థ్యం సరిపోకపోతే వాటి మీద అధిక లోడు పడుతుంటుంది. దీనిని నివారించడానికి రూ.2 కోట్లతో 16 కేవీ నుంచి 100 కేవీ కెపాసిటీగల 55 కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫారాలను ఏర్పాటు చేశారు. పదిచోట్ల ట్రాన్స్‌ఫారాల సామర్థ్యం పెంచారు.

కొత్తగా మూడు విద్యుత్ సబ్‌స్టేషన్లు

కె.కోటపాడు మండలం చౌడువాడలో రూ.4 కోట్లతో 5 ఎంవీఏ సామర్థ్యంతో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. చోడవరం మండలానికి కూడా 5 ఎంవీఏ సబ్ స్టేషన్ మంజూరైంది. దీనిని నరసయ్యపేటలో ఏర్పాటు చేస్తారు. ఇదే తరహాలో మాడుగుల మండలం కింతలిలో కూడా సబ్‌స్టేషన్ నిర్మిస్తారు. ఇక్కడ సబ్‌స్టేషన్ నిర్మాణం చేసే స్థలానికి అప్రోచ్ రోడ్డు వేయాల్సి ఉంది. రోడ్డు అందుబాటులోకి వస్తే వెంటనే పనులు మొదలు పెడతామని ఈఈ వీడీవీ రామకృష్ణారావు తెలిపారు. గత ఏడాది కోటవురట్ల, నాతవరం, రావికమతంలో అదనంగా 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫారాలు ఏర్పాటు చేయడం వల్ల విద్యుత్ లోటల్టేజీ, ఇతర సమస్యలను అధిగమించామని ఆయన చెప్పారు.

ఏఐ కోర్సుల మంజూరుకు కృషి

ఉద్యోగ విజయోత్సవ సభలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు



ఉద్యోగ విజయోత్సవ సభకు హాజరైన విద్యార్థులు



ఉద్యోగ నియామక పత్రాన్ని అందజేస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ) కోర్సులు మంజూరుకు కృషి చేస్తానని స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం ఉద్యోగ విజయోత్సవ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఇక్కడ చదువుకుని పలు బహుళ జాతీయ కంపెనీలలో ఉద్యోగాలు సాధించిన 95 మందికి, 45 మంది కాకినాడ కైట్ కళాశాల విద్యార్థులకు ఉద్యోగ నియామకపత్రాలు అందజేశారు. అనంతరం స్పీకర్ మాట్లాడుతూ 1985లో ముఖ్యమంత్రి ఎన్టీఆర్ హయాంలో తాను సాంకేతిక మంత్రిగా పనిచేసినప్పుడు పాలిటెక్నిక్ కళాశాల మంజూరు చేశారని తెలిపారు. ఇక్కడ చదువుకున్న విద్యార్థులు దేశ, విదేశాలలో మంచి ఉద్యోగాలలో రాణిస్తున్నారన్నారు. ఈ ఏడాది క్యాంపస్ సెలక్షన్స్‌లో ఈసీఈలో 50 మంది విద్యార్థులు, మెకానికల్ ఇంజనీరింగ్‌లో 39 మంది, మైనింగ్‌లో ఆరుగురు చొప్పున 95 మంది ఉద్యోగాలు సాధించారని ఆయన తెలిపారు. కాకినాడ కైట్ కళాశాలలో నర్సీపట్నంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వంద మందికి పైగా విద్యార్థులు చేరుతున్నారని చెప్పారు.

45 మంది ఈ ప్రాంత విద్యార్థులు ఆమెజాన్, ఇన్ఫోసిస్, మిరాకిల్, మహీంద్ర, పిపుల్ టెక్ వంటి మల్టీనేషనల్ కంపెనీలలో ఉద్యోగాలకు ఎంపిక కావడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. అందకుముందు జ్యోతి ప్రజ్వలన చేసి ఉద్యోగ విజయోత్సవం సభను స్పీకర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వీవీ రమణ, తహసీల్దార్ రామారావు, ప్రిన్సిపాల్ జీవీ రామచంద్రరావు, హెచ్‌వోడీలు నరసింహం, రవీంద్రనాథ్, డాక్టర్ ఫణికృష్ణ, కైట్ కళాశాల డైరెక్టర్ సరేఖ, ప్రిన్సిపాల్ రామకృష్ణ పాల్గొన్నారు.

రైల్వే జోన్ పనులను అడ్డుకున్న గిరిజనులు



పనులను అడ్డుకుంటున్న గిరిజనులు

విశాఖపట్నం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కోస్తా రైల్వే జోన్ డివిజన్ కార్యాలయ నిర్మాణంలో భాగంగా చేపడుతున్న పనులను స్థానిక గిరిజనులు మంగళవారం అడ్డుకున్నారు. తమకు ప్రభుత్వం కేటాయించిన భూముల్లో నిర్మాణాలు చేయవద్దంటూ నినాదాలు చేశారు. వివరాలిలా ఉన్నాయి. నగర పరిధిలోని చినగదిలి మండలం ముడసర్లోవ రిజర్వాయర్‌కు సమీపంలో సుమారు 52 ఎకరాలను రైల్వే జోన్ కోసం రాష్ట్ర ప్రభుత్వం రైల్వే శాఖకు బదలాయించింది. ఆ స్థలంలో బూసి భుయాన్ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ సిబ్బంది మంగళవారం ఎక్స్‌కవేటర్‌తో స్థలం చదునుచేసే పనులు ప్రారంభించారు. అయితే స్థానికంగా నివాసముంటున్న గిరిజనులు పెద్దసంఖ్యలో అక్కడకు చేరుకుని పనులను అడ్డుకున్నారు. అక్కడ సుమారు 66 ఎకరాలను 1963లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 66 గిరిజన కుటుంబాలకు కేటాయించిందని, శ్రీకృష్ణాపురంలో ఇళ్లు కూడా నిర్మించిందని వివరించారు. తమ భూముల్లో పనులు చేపట్టవద్దంటూ నినాదాలు చేశారు. న్యాయం జరిగే వరకు పోరాడతామని హెచ్చరించారు. ఏమైనా అభ్యంతరాలుంటే జిల్లా కలెక్టర్‌ను కలిసి నివేదించాలని కాంట్రాక్టు సిబ్బంది వారికి సూచించడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనంతరం పనులు యథావిధిగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకుడు పైడిరాజుతో పాటు అధికసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు



పట్టుబడిన మద్యం సీసాలు

కృష్ణాదేవిపేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం పాతకృష్ణాదేవిపేట గ్రామానికి చెందిన వజ్రపు రాజుబాబు వద్ద ఏడు మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు కృష్ణాదేవిపేట ఎస్ఐ వై.తారకేశ్వరరావు తెలిపారు. పాతకృష్ణాదేవిపేటలో అధికంగా మద్యం తెచ్చి ఎంఆర్‌పీ కంటే అధిక రేట్లకు విక్రయిస్తున్నట్టు మంగళవారం అందిన సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి దాడి చేసినట్టు చెప్పారు. ఈ మేరకు రాంబాబు వద్ద ఏడు మద్యం ఫుల్ సీసాలను స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. గ్రామాల్లో సారా విక్రయాలు, అక్రమంగా మద్యం, బెల్టుషాపులు నిర్వహిస్తే 9440904240 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని ఎస్ఐ కోరారు.

సాగునీటి వనరులకు మోక్షం

... 5వ పేజీ తరువాయి

చేపడుతున్నారు. మాకవరపాలెం మెరక కాలువ గేట్లు మరమ్మతులకు గురికావడంతో నీరంతా వృథాగా పోతున్నది.

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత సాగునీటి వనరుల అభివృద్ధిపై పాలకులు దృష్టి సారించారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మండల అధికారులు అంచనాలు తయారు చేశారు. సాగునీటి సంఘాల వారీగా మరమ్మతు పనులకు నిధులు మంజూరు కోసం రూ.3.16 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు ఇరిగేషన్ జేఈ రామన్నపాత్రుడు తెలిపారు. మాకవరపాలెం ఛానెల్‌కు రూ.19.8 లక్షలు, మల్లవరం ఛానెల్ రూ.42.8 లక్షలు, తూటిపాల ఛానెల్ రూ.39.8 లక్షలు, జి.కోడూరు ఛానెల్ రూ.63 లక్షలు, పెద్దిపాలెం ఛానెల్ రూ.20 లక్షలు, బూరుగుపాలెం ఛానెల్ రూ.39.2 లక్షలు, జంగాలపల్లి ఛానెల్ రూ.19.6 లక్షలు, పైడిపాల ఛానెల్ రూ.19.5 లక్షలు, తాడపాల ఛానెల్ రూ.19.5 లక్షలు, బయ్యవరం ఛానెల్‌కు రూ.20 లక్షలతో ప్రతిపాదనలు పంపారు. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపట్టి, ఖరీఫ్ ప్రారంభంనాటికి పూర్తి చేస్తామని జేఈ చెప్పారు.